ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 11-08- 2026 | సంపుటి: 17, సంచిక: 129, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



### వెంటనే కాళేశ్వరం మోటార్లు
# ఆన్ చేయండి

- నీళ్లు లేక ఆందోళనలో అన్నదాతలు
- సాగు నీరు కోసం రైతాంగం ఎదురు చూపు
- ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు లేఖ

హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాకలం) : తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాలోని రిజర్వాయర్ లు అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్) రిజర్వాయర్ లను నింపి సుమారు 4లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలోని రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మోటార్లను

తరువాయి 2వ పేజీలో...

### కృష్ణమ్మ తీరాన మహా
# వరుణ యాగం

## 108 మంది రుత్వికులు, 11 హోమ గుండాలు

### పూర్ణాహుతిలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు
### ఆది పూజతో యాగం ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ దంపతులు



నల్లగొండ, ఆగస్టు 10 (ప్రజాకలం) : వర్షాలు సమృద్ధిగా కురవాలన్న మహా సంకల్పంతో నల్లగొం డ జిల్లా నాగా ర్జునసాగర్ వద్ద సోమవారం నిర్వహించిన మహా వరుణ యాగంతో కృష్ణమ్మ తీరం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కృష్ణానది తీరాన నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ లో మహా వరుణ యాగాన్ని నిర్వహించింది. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, కృష్ణా, గోదావరి నదులు జలకళతో పరవ ళ్లు తొక్కాలని, రైతాంగం సుభిక్షంగా ఉ ండాలని సంకల్పించి ఈ యాగం చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆల య అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో యాగ క్రతువు కొనసాగింది.

తరువాయి 2వ పేజీలో...

### బలమైన వృద్ధి బాటలో
# తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ది ఇండియన్ ఎకానమీ 2025–26లో తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక గణాంకాలు

- నిర్మాణం, వాణిజ్యంలో గణనీయమైన పురోగతి
- ఆరేళ్లలో రెట్టింపైన ఆర్థిక పరిణామం




హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాకలం) : తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధి బాటలో పయనిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా గణాంకాలు స్పష్టం చేస్తు న్నాయి. ఆర్బీఐ విడుదల చేసిన హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ది ఇండియన్ ఎకానమీ 2025–26లో తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన కీలక గణాంకాలు వెల్లడయ్యా యి. రాష్ట్ర ఆదా యం, తలసరి ఆదాయంతో పాటు వ్యవసాయం, తయారీ, నిర్మాణం, వాణిజ్యం, రవాణా, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, ఇతర సేవారంగాల్లోనూ వృద్ధి నమోదైంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల వద్ద తెలంగాణ నికర రాష్ట్ర దేశీయోత్పత్తి(ఎన్ఎస్డీపీ) రూ.16.15 లక్షల కోట్లకు చేరింది. 2024–25లో ఇది రూ.14.58 లక్షల కోట్లుగా ఉండగా.. ఒక్క ఏడాదిలోనే సుమారు రూ.1.57 లక్షల కోట్ల మేర పెరిగి దాదాపు 10.8 శాతం వృద్ధి నమోదైంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో సేవారంగం కీలక పాత్ర పోషిస్తున్న విషయం తాజా గణాంకాల్లో మరోసారి స్పష్టమైంది. ముఖ్యంగా వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసులు, రవాణా, కమ్యూనికేషన్, ఆర్థిక సేవలు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి ప్రధాన కారణాలుగా మారాయి.

**ఏటేటా పెరుగుతున్న వృద్ధి ఇలా..**

వాణిజ్యం, రిపేర్, హోటళ్లు, రెస్టారెం ట్ల రంగం విలువ 2024–25లో రూ.2,83,799 కోట్లుగా ఉండగా.. 2025–26లో రూ.3,31,528 కోట్లకు పెరిగి ఒక్క ఏడాదిలోనే దాదాపు రూ.47,700 కోట్ల పెరుగుదల నమోదైంది. రియల్ ఎస్టేట్, గృహ యాజమాన్యం, ప్రొఫెషనల్ సర్వీసుల రంగం రూ.2,99,694 కోట్ల నుంచి రూ.3,34,688 కోట్లకు పెరిగింది.

తరువాయి 2వ పేజీలో...

### ఈనెల 15 తర్వాత
# ఉద్యమబాట

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

### ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకోం
### ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు



హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాకలం) : ఈనెల 15 తర్వాత ఉద్యమబాట చేపడతామని, ఉద్యమ స్ఫూర్తిని చూపిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల తమ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో చెప్పినట్లు ఆయన వెల్లడించారు. క్యూర్‌పై సెమినార్ నిర్వహించి, ప్రజాభిప్రాయం తీసుకుంటా మని, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకోబోమ న్నారు. సర్ తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలుండే అవకాశముందని, బంకీపూర్ ఉపఎన్నికలో అభ్యర్థి ఎంపికలో జాప్యం జరిగిందని పేర్కొన్నా రు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని ఆయన చె ప్పారు. సీఎం రేవంత్ వరుణ యాగంచేస్తే, తాము వాళ్లు కొట్టుకుపోవాలని వా యుయాగం చేస్తామని, క్షుద్రపూజలను తమ పార్టీ నమ్ముకోలే దన్నారు. హిట్లర్ ఆలోచనలు, హిల్ట్, హైడ్రా (ట్రిపుల్ హెచ్)పాలసీలతో రాష్ట్ర అభివృద్ధి హాల్ట్ అయ్యిందని విమర్శించారు. అధికారులను ఉ ద్దేశించి కోర్టు వ్యాఖ్యలను పరిశీ లిస్తే రాష్ట్రంలో అడ్మినిస్ట్రేషన్ పూ ర్తిగా ఫె యిలయ్యిందని స్పష్ట మవుతుందన్నారు. సోమవారం పార్టీ కార్యాల యం లో మీ డియాతో రాంచందర్ రావు చిట్ చాట్ చేసారు. తాము ఇతర పార్టీలలాగా క్షుద్ర పూజలను నమ్ముకోలేదు.. ప్రజా పూజ ను నమ్ముకు న్నామన్నారు. అమెరికా భా రత్‌గా మారిం దని, ఎక్కడ చూ సినా భారతీయులే ఉన్నార న్నారు. ఢిల్లీలో నితిన్ నబీన్‌తో చర్చించామని, రాష్ట్రం లో అధికారమే లక్ష్యంగా పనిచేయా లని జాతీయ పార్టీ డైరెక్షన్ ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో పరిపాలనా లోపంతోనే అధికారులపై చర్యలు తీసుకుం టున్న పరి స్థితి ఏర్పడిందన్నారు. హైడ్రా చేపడుతున్న పనుల వల్ల కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు సీరియస్ అయిందన్నారు. బాలాపూర్, నాదర్‌గుల్ వద్ద భూములన్నీ ప్రభుత్వ భూములు, భూదాన్ భూములేనని, వాటిని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత హైడ్రాపై లేదా? అని ప్రశ్నించారు.

**ఎంఐఎం నేతల ఆస్తులపై చర్యలేవి?...**

మజ్లిస్ పార్టీ నేతల ఆస్తులపై కోర్టు చెప్పాక కూడా ప్రభుత్వం తప్పించుకునే ప్ర యత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నిర్ణయాల వల్ల ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని, ఈనెల 15 తర్వాత క్యూర్‌పై పబ్లిక్ ఒపీనియన్ తీసుకునేందుకు వర్క్ షాప్ నిర్వహిస్తామన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




### నర్సంపేట ప్రాంత రైతాంగం సంక్షేమం కోసం
# పెద్ది చేసిన కృషి మరచిపోలేనిది



## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### నర్సంపేట మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం
### పెద్ది విగ్రహ గద్దె కూల్చివేతపై బీఆర్ఎస్ నిరసన

మహబూబాబాద్, ఆగస్టు 10 (ప్రజాకలం) : ఎన్నేళ్లు బతికామన్నది అన్నది ముఖ్యం కాదు.. ఎట్లా బతికామన్నది ముఖ్యమని.. అనునిత్యం ప్రజల క్షేమం కోసం, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

తరువాయి 2వ పేజీలో...

# 'క్యూర్'లో ఇండ్ల గడువు పెంపు

- 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- వరుస సెలవుల నేపథ్యంలో నిర్ణయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాకలం) : హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పథకం దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం మరో ఐదు రోజులు పొడిగించింది. ఈ నెల 15వ తేదీ శనివారం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. విలువైన ప్రభుత్వ భూముల్లో ఉచితంగా పేద, మధ్య తరగతి ప్రజలకు నామమాత్రపు ధరలో సొంతింటిని అందించాలన్నది

తరువాయి 2వ పేజీలో...



### విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యలపై
# చర్చకు సిద్ధం

### - కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, వారిపై పోలీసు చర్యలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. విద్యార్థుల ఉద్యమానికి సంబంధిం చిన ప్రతి అంశంపైనా చర్చించేందుకు కేంద్రం సిద్ధమేనని ఆయన సోమవారం తెలిపారు. అయితే, సభా కార్యక్రమాలను అడ్డుకునేలా విపక్షాలు హంగామా చేయకూ డదని స్పష్టం చేశారు. 'విద్యార్థుల ఉద్యమం, దానికి సంబంధించిన పరిణామాలపై పూర్తి స్థాయి, సవివరమైన చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే చర్చ జరుగుతు న్నప్పుడు, హోంమంత్రి లేదా ప్రభుత్వం సమాధానం ఇస్తున్న సమయంలో విపక్షాలు సభలో అంతరాయం కలిగించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని

తరువాయి 2వ పేజీలో...

# ఆహార భద్రతకు ఇథనాల్ ముప్పు

### 'ఫుడ్ వర్సెస్ ఫ్యూయల్' సంక్షోభంపై 377నిబంధన ద్వారా లోక్‌సభలో ఖమ్మం ఎంపీ
### రఘురాం రెడ్డి ఆందోళన - కార్మికుల వేతనాల స్థితిగతులపై మరో ప్రశ్నలో ఆరా



ఖమ్మం ఆగస్టు 10(ప్రజా కలం న్యూస్ ) దేశంలో మారుతున్న ఇంధన అవసరాలు, కార్మికుల వేతనాల స్థితిగతులపై పార్లమెంటులో కీలక చర్చ సాగింది. పార్లమెం ట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి వేర్వేరు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం ఆహార పంటల వాడకం వల్ల భవిష్యత్తు లో ఎదురుకానున్న ఆహార భద్రత ప్రమాద సంక్షోభంపై 377 నిబంధన కింద ఎంపీ రఘురాం రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముమ్మాటికీ ఆహార భద్రతకు పెను ముప్పే.. చెరకు, ధాన్యం, మొక్కజొన్న వంటి ఆహార పంటల నుంచి ఇథనాల్ ఉత్పత్తిని విపరీతంగా పెంచడం వల్ల భవిష్యత్తులో ఆహార భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు.

తరువాయి 2వ పేజీలో...

# కృష్ణమ్మ తీరాన మహా వరుణ యాగం

మొదటి పేజీ తరువాయి...

108 మంది రుత్విక్కులు, 11 హోమ గుండాల్లో దేవతా ఆవాహనం చేసి వరుణ యాగాన్ని ప్రారంభించారు. సోమవారం వేకువ జామున నాలుగు గంటలకే మొదలైన మహా వరుణ యాగంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పద్మావతి దంపతులు ఆది పూజ నిర్వహించి యాగాన్ని ప్రారంభించారు. తొలుత వేద పండితులు, రిత్వికులు మంత్రోచ్చారణల మధ్య విశ్వక్‌సేనుడికి ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర కృష్ణానది జలంతో కలశాలను ఏర్పాటు చేసి, వాటిలో దేవతా ఆవాహనం చేసి కలశ స్థాపన చేశారు. వరుణుడి కరుణ కోసం రుత్విక్కులు వేద పండితులు చతుర్వేద వేద పారాయణాలు, లక్ష జపాలు పఠించారు. వేద పండితులు రుత్వికుల మంత్రోచ్చారణలతో విజయ విహార్ ప్రాంగణం మారుమోగింది. మధ్యాహ్నం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ యాగ స్థలాన్ని సందర్శించి పూర్ణాహుతి ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 3:20 గంటలకు జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొని పూర్ణాహుతి సామగ్రిని హోమగుండంలో వేశారు. వానలు సమృద్ధిగా కురవాలని అన్ని జలాశయాలకు జలకళ సంతరించుకుని రైతులకు ఆశించిన పంటలు పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలతో విజయ్ విహార్ ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. ప్రజలు యాగాన్ని తిలకించేందుకు జిల్లా యంత్రాంగం విజయ్ విహార్ ప్రాంగణం మొత్తం ఎల్ఈడి స్క్రీన్లు, ప్రవచనశాల, ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ బి చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, కుందూరు జయవీర్‌రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, డెయిరీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, యాదగిరిగుట్ట ఈవో భవాని శంకర్, పాలకమండలి సభ్యురాలు విజయరాజం, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, ప్రేమ్ కరణ్‌రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాస్ నేత పాల్గొన్నారు.

# వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేయండి

మొదటి పేజీ తరువాయి...

ఆన్ చేసి వెంటనే నీటి పంపింగ్ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్ రావు రైతుల పక్షాన రాసిన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం పంట సీజన్ రైతులు ఇటు ఎలినినో వల్ల తక్కువ వర్షాభావం, అటు ప్రాజెక్టుల్లో రిజర్వాయర్ లలో నీటిని సకాలంలో నింపక పోవడం తద్వారా పంటల సాగు ముందుకు సాగక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్న విషయం పేర్కొన్నారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వలన వచ్చే వరదను తద్వారా ప్రతి నీటి చుక్కని ఒడిసి పట్టి సకాలంలో కాళేశ్వరం ప్రాజెక్ట పంపులను ఆన్ చేసి రైతుల ప్రయోజనాల దృష్ట్యా నీటి పంపింగ్ ప్రారంభించాలని హరీష్ డిమాండ్ చేశారు.
కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మిడ్ మానేరు రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 27 టీఎంసీలు, ప్రస్తుతం సుమారు 22 టీఎంసీల నీటి లభ్యత ఉందని, అదేరకంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన గోదావరి లోని వరద నీటి లభ్యత కూడా ఏర్పడనుందని తెలిపారు.
ఈ విషయం దృష్టిలో ఉంచుకొని మిడ్ మానేరు నుండి మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ ప్రారంభించాలని, తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్,కొండపోచమ్మ సాగర్, నృసింహ (బస్వాపూర్ ) తదితర రిజర్వాయర్ లను, వాటి పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్ ల అన్నింటిని నింపి సుమారు 4లక్షల ఎకరాలకు నీరందించేలా చర్యలు చేపట్టలని సూచించారు. రైతు సాగు ప్రయోజనాలు తీర్చడానికి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా నీటి పంపింగ్ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు, ప్రస్తుత నీటి లభ్యత 6.9 టీఎంసీలు ఉన్నాయని తెలిపారు. మిడ్ మానేరు నుండి లోయర్ మానేరు కు నీటిని నింపి SRSP STAGE -2 లోని అవసరమగు ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని పైరిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4లక్షల ఎకరాలు సాగు అయిన విషయం గుర్తించి ఈ వానాకాలం పంటకి అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడ సాగునీరు అందించేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లు నింపి తద్వారా వాటి అనుసంధానంగా నిర్మించిన కాలువలు, చెరువులు చెక్ డ్యామ్ లు అన్నింటినీ నింపి రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించి రైతు ప్రయోజనాల దృష్ట్యా రాజకీయలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ ను మాజీ మంత్రి కోరారు.

# బలమైన వృద్ధి బాటలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ

మొదటి పేజీ తరువాయి...

హైదరాబాద్ సహా రాష్ట్ర పట్టణ ప్రాంతాల్లో నిర్మాణం, రియల్ ఎస్టేట్, వ్యాపార సేవలు విస్తరిస్తున్న ప్రభావం ఈ గణాంకాల్లో ప్రతిబింబిస్తున్నట్లు తెలుస్తోంది. రవాణా, నిల్వ, కమ్యూనికేషన్, ప్రసారాలకు సంబంధించిన సేవల విలువ రూ.96,233 కోట్ల నుంచి రూ.1,09,996 కోట్లకు, ఆర్థిక సేవల రంగం రూ.71,496 కోట్ల నుంచి రూ.80,183 కోట్లకు పెరిగింది. ఇతర సేవల రంగం రూ.1,18,186 కోట్ల నుంచి రూ.1,33,643 కోట్లకు పెరిగింది.

**తయారీ రంగంలోనూ పెరిగిన వాటా**

సేవారంగంతో పాటు తయారీ రంగం కూడా రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో తన వాటాను పెంచుకుంటోంది. 2024-25లో రూ.1,04,472 కోట్లుగా ఉన్న తయారీ రంగం విలువ 2025-26లో రూ.1,12,490 కోట్లకు పెరిగింది. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవల విలువ రూ.24,731 కోట్ల నుంచి రూ.27,396 కోట్లకు చేరింది. నిర్మాణ రంగం కూడా రూ.76,256 కోట్ల నుంచి రూ.84,960 కోట్లకు పెరిగింది.
ఇది రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మౌలిక వసతుల నిర్మాణం, పట్టణీకరణ, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని సూచిస్తోంది. ప్రస్తుత ధరల గణాంకాలతో పాటు స్థిర ధరల వద్ద నమోదైన వృద్ధి కూడా తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు సానుకూల సంకేతాలను ఇస్తోంది. వ్యవసాయం, పశుసంవర్ధక, అటవీ, మత్స్య రంగాల విలువ రూ.94,195 కోట్ల నుంచి రూ.96,785 కోట్లకు పెరిగింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ గత ఆరేళ్లలో ఎంత మేర విస్తరించిందనేది ఎన్ఎస్డీపీ గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.
2020-21లో ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర ఎన్ఎస్డీపీ రూ.8.49 లక్షల కోట్లు కాగా.. 2025-26 నాటికి అది రూ.16.15 లక్షల కోట్లకు చేరింది. అంటే ఆరేళ్ల వ్యవధిలో రాష్ట్ర ఆర్థిక పరిమాణం దాదాపు రెట్టింపైంది. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయంలో నమోదైన పెరుగుదల కూడా ఆర్బీఐ గణాంకాల్లో ప్రత్యేకంగా కనిపిస్తోంది. 2020-21లో ప్రస్తుత ధరల వద్ద తెలంగాణ తలసరి ఎన్ఎస్డీపీ రూ.2,25,734గా ఉండగా.. 2025-26లో అది రూ.4,18,931కు చేరింది. మొత్తంగా ఆర్బీఐ తాజా గణాంకాలను ప్రకారం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో బహుముఖ వృద్ధి కనిపిస్తోంది. సేవారంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ప్రధాన అండగా కొనసాగుతున్నప్పటికీ.. తయారీ, నిర్మాణం, వాణిజ్యం, రవాణా, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్ వంటి రంగాలు కూడా వేగంగా విస్తరిస్తున్నాయి. అయితే రాష్ట్ర ఆర్థిక వృద్ధి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా? వ్యవసాయ రంగ ఆదాయాలు, ఉపాధి కల్పన, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, చిన్న పరిశ్రమల పరిస్థితి ఎలా ఉంది? వంటి అంశాలపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## నర్సంపేట ప్రాంత రైతాంగం సంక్షేమం కోసం

# పెద్ది చేసిన కృషి మరచిపోలేనిది

మొదటి పేజీ తరువాయి...

పెద్ది సుదర్శన్‌రెడ్డి అంతిమయాత్రకు లక్ష మంది జనం స్వచ్ఛందంగా తరలి రావడమే అందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లిలో సోమవారం పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మకు కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నర్సంపేట ప్రాంత రైతాంగం సంక్షేమం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డి చేసిన కృషి మరచిపోలేనిదని, పెద్ది జన్మ ధన్యమైందని ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కృషితోనే దేవాదుల నీరు చెరువుల్లోకి మళ్లించారని, రాష్ట్రంలో జిల్లా కేంద్రానికి వెలుపల నియోజకవర్గ కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయించడం వెనక పెద్దికి ఈ ప్రజలపై ఉన్న మమకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. రెండు సంవత్సరాలలో తిరిగి రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే నర్సంపేట లోని మెడికల్ కళాశాలకు పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టి తీరుతామని ప్రకటించారు.

**కంటతడి పెట్టిన హరీశ్‌రావు**

పెద్ది సుదర్శన్‌రెడ్డి సిసలైన తెలంగాణ ఉద్యమకారుడు అని మాజీ మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమం కోసం నిర్వహించిన అనేక కార్యక్రమాలకు పెద్ది సుదర్శన్‌రెడ్డి నాయకత్వం వహించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2014లో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యేగా పరాజయం పాలు కాగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనకు సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్‌గా క్యాబినెట్ ర్యాంకు పదవి ఇచ్చారని చెప్పారు. పెద్దితో కలిసి ఉద్యమంలో పాల్గొన్న సంఘటనలను గుర్తు చేసుకుంటూ హరీశ్‌రావు భావోద్వేగానికి లోనయ్యారు. నెల రోజులపాటు హనుమకొండలో పెద్ది తాను ఒకే రూమ్‌లో ఉండి అనేక ఉద్యమాలను నిర్వహించడంలో పాలు పంచుకున్నామని, పెద్దిలాంటి ఆప్త మిత్రుడిని కోల్పోవడం తనకు తీరనిలోటని హరీశ్‌రావు కంటతడి పెట్టారు.

**పెద్ది విగ్రహ గద్దె కూల్చివేత**

పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి నర్సంపేటలో నిర్మిస్తున్న గద్దెను మున్సిపల్ సిబ్బంది ఆదివారం రాత్రి తొలగించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహావిష్కరణ కోసం నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేయ తలపెట్టిన ప్రదేశంలో గద్దె నిర్మాణానికి పూనుకున్నారు. అయితే మున్సిపల్ అనుమతి లేదని ఆదివారం రాత్రి ఉన్నఫలంగా గద్దెను కూల్చడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు నర్సంపేటలో ఆందోళనకు దిగారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా కచ్చితంగా పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం ఆవిష్కరించి తీరుతామని ప్రకటించారు.
ఈ కుట్రలు చూస్తుంటే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పై కూడా మాకు అనుమానాలు వస్తున్నాయని, తనను మానసికంగా ఎంత ఇబ్బంది పెట్టారో అర్థం అవుతుందన్నారు. విగ్రహం గద్దెను ఎలాంటి సమాచారం లేకుండా కూల్చివేయడం దారుణమని, నర్సంపేట పట్టణంలో ఎన్ని విగ్రహాలు అనుమతితో పెట్టారని ప్రశ్నించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గారి దశదిన కార్యక్రమం ఉన్నందున తాత్కాలిక ఈ ధర్నాను విరామించుకున్నామని, 2 రోజుల సమయం ఇస్తున్నాం ఆలోపు ఈ విగ్రహ గద్దెను కూల్చిన వారినీ శిక్షించకపోతే రాష్ట్రవ్యాప్తముగా, ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రామ గ్రామన పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

# ఈనెల 15 తర్వాత ఉద్యమబాట

మొదటి పేజీ తరువాయి...

క్యూర్‌తో సామాన్యులపై భారం పడుతుందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో చిదంబరం.. బ్లెండెడ్ ఇథనాల్ పెట్రోల్‌పై ఆన్ రికార్డ్ మాట్లాడారని, కాంగ్రెస్ వాళ్ళు పెట్టిన ప్రతిపాదనలే ఇవన్నీ, 2013లో గెజిట్ కూడా వచ్చిందన్నారు. 40 వేల కిలోమీటర్ల.. మేర వాహనం ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడుస్తోందని తెలిశాకే దీన్ని అమలు చేస్తున్నా రన్నారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు.

**వెళ్లే వారిని ఆపలేం...**

సర్ వల్ల తమ పార్టీ యాక్టివిటీ కొంత తగ్గిందని, ఇదే విషయాన్ని జాతీయ నాయకత్వానికి వివరించామన్నారు. పంద్రాగస్టు తర్వాత ఉద్యమాల స్వరూపాన్ని చూపిస్తామని చెప్పారు. ధరణి, భూ భారతికి పెద్ద తేడా ఏమీ లేదని, వాళ్ళు ఒకలా దోచుకుంటే.. వీళ్ళు మరోలా దోచుకుంటున్నారని ఆరోపించారు. బీహార్ బంకీపూర్ ఉపఎన్నిక ఓటమికి అభ్యర్థి ఎంపికలో జాప్యం, అతితక్కువగా పోలింగ్ శాతం నమోదు కావడం కారణమైందని భావిస్తున్నామన్నారు. సినిమా పిచ్చి ఉన్నవాళ్ళు కొంతమంది జనసేనలో పోతున్నారని, వెళ్లిన వారిని అడిగితే తాను పవన్ కళ్యాణ్ ఫ్యాన్ అని అంటున్నారని, అయితే గతంలో ఎందుకు వెళ్లలేదని అడిగితే అప్పుడు తెలంగాణలో జనసేన లేదని బదులిచ్చారన్నారు. వెళ్లేవారిని అడ్డుకోలేమన్నారు. సర్ ప్రక్రియ తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తాయని భావిస్తున్నామన్నారు. వాస్తవానికి ఈ ఎన్నికలకు ప్రక్రియ తో సంబంధం లేదు.. కానీ కొత్త ఓటర్ లిస్ట్ ప్రకారమే ఉంటుందని నమ్ముతున్నామని ఆయన చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఉన్నవారికే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

**రేవంత్ ఈసారి ఏ వర్సిటీకు వెళ్తారో..**

సీఎం రేవంత్ వరుణయాగం చేస్తే.. తాము వాళ్ళు కొట్టుకుపోవాలని వాయుయాగం చేస్తామని ఎద్దేవా చేశారు. ఎల్‌నినో వచ్చిందని తెలిసిన సీఎం.. ముందే యాగం చేయొచ్చు కదా..అన్నారు. వర్షాకాలం ముగిసే సమయానికి చేయడం ఎందుకు? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో ఈసారి ఏ యూనివర్సిటీకి వెళ్తాడో మరి.. ఏ కోర్సు చేసి వస్తారో చూడాలన్నారు. పార్టీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ లీడర్లందరికీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామని చెప్పా రు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అందరికీ రానున్న రోజులల్లో రకరకాల బాధ్యతలు అప్పగిస్తామన్నారు.

**రేపు స్కార్పియో వస్తుందేమో...**

ఢిల్లీలో నిరసన చేసిన వారిలో వామపక్ష విద్యార్థి సంఘాలు, ఇతర పార్టీలకు చెందని వారే ఉన్నారని ఆయన చెప్పారు. వీరందరితోనే కాక్రోచ్ పార్టీ అని పేరుపెట్టారన్నారు. నేడు కాక్రోచ్.. రేపు స్కార్పియో వచ్చినా ఆశ్చర్యంలేదన్నారు. కేంద్రం ఏం చేసినా దానికి వ్యతిరేకంగా ఇండి కూటమి, ఆప్ పార్టీ నాయకులు వ్యతిరేకిస్తున్నారన్నారు.
కాంగ్రెస్‌లో జెన్ జీ ఎమ్మెల్యేలు ఉన్నారు కదా.. వారికి మంత్రి పదవి ఇవ్వొచ్చు కదా? అని ఆయన ప్రశ్నించారు. తన వద్ద ఉన్న శాఖలను ఎవరికైనా ఇవ్వొచ్చుగా అన్నారు. డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ఆలోచించి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరు పోటీ చేయాలని చెప్పారని, అయితే ఫీజురీయింబర్స్‌మెంట్‌పై ప్రశ్నిస్తారని భావించి సీఎం వారిని సంతోష పెట్టేందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి క్విట్ ఇండి యా ఉద్యమం ఎలా ఉంటుందో చూపించాలని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, అసలు క్విట్ ఇండియా ఉద్యమం వచ్చిందే కాంగ్రెస్ వల్ల అని తాము కూడా ప్రజలకు వివరిస్తామన్నారు.

# ఆహార భద్రతకు ఇథనాల్ ముప్పు

మొదటి పేజీ తరువాయి...ఆహార ధాన్యాలను ఇథనాల్‌కు మళ్లించడం ద్వారా ప్రజల వినియోగానికి లోటు ఏర్పడి, ఎగుమతులకు లభ్యత తగ్గి, ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆహార భద్రత ముప్పు సందిగ్ధత కారణంగా రైతులు తృణధాన్యాలు, నూనెగింజల సాగును తగ్గించి, ఇథనాల్ ముడిసరుకైన చెరుకు వైపు మళ్లే ధోరణి పెరుగుతోందని, ఇది పోషకాహార భద్రతను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. నీటి వినియోగం అత్యధికంగా ఉండే చెరుకు సాగు విస్తరణ వల్ల భూగర్భ జలాలు ఇప్పటికే క్షీణిస్తున్న ప్రాంతాల్లో పరిస్థితి మరింత దిగజారుతుందని హెచ్చరించారు.

కార్మికుల వేతనాలు, జీవన ప్రమాణాల పరిస్థితేంటి..?

దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కార్మికుల సగటు వాస్తవ వేతనాలు, జీవన ప్రమాణాలపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల సహాయ మంత్రి శోభా కరంద్లాజే లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 20 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 600 గ్రామాల నుంచి జాతీయ నమూనా సర్వే సంస్థ సేకరించిన సమాచారం ఆధారంగా జూన్ 2025 వరకు వ్యవసాయ, వ్యవసాయేతర వృత్తుల సగటు రోజువారీ వేతన రేట్లను అధ్యయనం చేసినట్లు తెలిపారు. ఇండస్ట్రియల్ వర్కర్ల కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ పెరుగుదలకు అనుగుణంగా వీటిని ఎప్పటికప్పుడు సవరిస్తామని పేర్కొన్నా రు. 30.03.2026 నాటికి నోటిఫై చేసిన కనీస వేతనాల వివరాలను వెల్లడించారు.

అమలు లోకి 2019 వేతనాల కోడ్

కార్మికుల ఆదాయ భద్రత, ఉద్యోగ నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర మంత్రి తెలిపారు. 'కోడ్ ఆన్ వేజెస్, 2019' (వ్లప్త జశీంవ శీఅ ఔస్త్రవం, 2019) చట్టం నవంబర్ 21, 2025 నుంచి అమల్లోకి వచ్చిందని, కనీస వేతన చట్టం-1948, వేతనాల చెల్లింపు చట్టం-1936, బోనస్ చెల్లింపు చట్టం-1965, సమాన వేతన చట్టం-1976లను విలీనం చేసిందని తెలిపారు. ఈ కోడ్ నిబంధనలను పటిష్టంగా అమలు చేసేందుకు ముమ్మర కృషి చేస్తున్నట్లు వివరించారు.

# విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యలపై చర్చకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి...

వారు వినాలి' అని రిజిజు పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్స్, బిహార్‌లోని సివాన్‌లో ఏకే-47 వినియోగంపై పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.
కాగా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ ఓ జాతీయ పత్రికలో రాసిన వ్యాసం నేపథ్యంలో కేంద్రం ఈ ప్రకటన చేయడం గమనార్హం.
విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై హోంమంత్రి అమిత్ షా ఇప్పటివరకు ఎలాంటి విచారణకు ఆదేశించలేదని, కనీసం ప్రకటన కూడా చేయలేదని ఆ వ్యాసంలో రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులపై జరిగిన దాడిని హోంమంత్రి సమర్థిస్తున్నారనే విషయాన్ని ఆయన మౌనం స్పష్టం చేస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు విపక్షాలు ప్రతిరోజూ నోటీసులు ఇస్తున్నప్పటికీ వాటిని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు పాల్పడిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థులపై టియర్ గ్యాస్, మేకులు అమర్చిన లాఠీలతో దాడి చేశారని, పెల్లెట్ గన్స్ ప్రయోగించారని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లోని సివాన్‌లో ఏకే-47 వినియోగంపైనా ఎంపీ ప్రశ్నలు లేవనెత్తారు. నీట్ పరీక్షలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు ముందుకు రావడం లేదని మండిపడ్డారు. కాగా, కేంద్ర మంత్రి తాజా ప్రకటనతో పార్లమెంట్‌లో ఎలాంటి వాడీవేడి చర్చ జరగనుందోననే ఆసక్తి నెలకొంది.

# 'క్యూర్'లో ఇండ్ల గడువు పెంపు

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా లక్ష ఇండ్లు నిర్మిస్తున్నామని, పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండుగ తదితర వరుస సెలవుల కారణంగా వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దరఖాస్తు గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు మంత్రి వెల్లడించారు. జూలై 21 నుంచి మీసేవ కేంద్రాలతో పాటు ఆన్‌లైన్, వాట్సాప్‌ల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, తొలుత ప్రకటించిన గడువు ఈనెల 10వ తేదీ సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. గడువు పెంచినప్పటికీ దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా ఉంటుందని.. అపోహలు, అనుమానాలకు తావుండదని మంత్రి స్పష్టం చేశారు.

# కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం: జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించ నున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



## ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాకలం)

చైతన్యనగర్ కాలనీ సంఘం ఆధ్వర్యంలో మెట్‌పల్లి పట్టణ మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మున్సిపల్ చైర్మన్‌ను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, చైతన్యనగర్ కాలనీ సంఘం అధ్యక్షులు పుల్లూరి నవీన్ కుమార్, కార్యదర్శి ఎల్మీ రవికుమార్, కోశాధికారి నరేంద్రుల రవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### ఆగస్టు 26న నిజామాబాద్‌లో

## టీఆర్ఎస్ పాంచజన్య సంకల్ప సభ

### సభ పర్యవేక్షకుడిగా కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘు

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాకలం) నిజామాబాద్ జిల్లా



కేంద్రంలోని కలెక్టరేట్ గ్రౌండ్‌లో ఆగస్టు 26న మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పాంచజన్య సంకల్ప సభ నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సభను విజయవంతంగా నిర్వహించేందుకు కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ రఘును సభ పర్యవేక్షకుడిగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించారు. సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది.

### ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి

## జారిపడ్డ వ్యక్తికి తీవ్ర గాయాలు



ఎండపల్లి, ఆగస్టు 10 : ( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన బొంగోని సత్తయ్య గౌడ్ సోమవారం రోజున సాయంత్రం రోజువారి వృత్తిరీత్యా తాటి చెట్టును ఎక్కి ప్రమాద వశాత్తు తాటి చెట్టు పై నుండి కింద పడడం తో సత్తయ్య గౌడ్ కు పలుచోట్ల గాయాలు కావడమే కాకుండా తలకు తీవ్ర గాయాలైనట్లు గౌడ సంఘం అధ్యక్షులు గొల్లపెల్లి సత్యం గౌడ్ తెలిపారు.

## కోలూర్ చౌకధరల దుకాణంలో వేగంగా ఉచిత బియ్యం పంపిణీ



తానూర్,ఆగస్టు 10(ప్రజా కలం): మండల పరిధిలోని కోలూరు గ్రామంలోని చౌకధరల దుకాణంలో ప్రభుత్వ బియ్యం పంపిణీ ప్రక్రియ అత్యంత వేగంగా జరుగుతోంది. గ్రామంలోని లబ్ధిదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఒకేసారి మూడు నెలలకు సంబంధించిన కోటా బియ్యాన్ని అందజేస్తున్నట్లు డీలర్ శంకర్ కులకర్ణి వెల్లడించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ఆందోళన చెందకుండా చౌకధరల దుకాణానికి వచ్చి, తమకు కేటాయించిన సరుకులను సకాలంలో తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు కూడా డీలర్ సమర్థవంతమైన నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆయిల్పామ్ స్థిరమైన ఆదాయం

తానూర్, ఆగస్టు 10(ప్రజా కలం): ఆయిల్పామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం లభిస్తుందని అధికారులు తెలిపారు, తానూర్ మండలంలోని దహగాం గ్రామంలో ఆయిల్పామ్ మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయినాథ్, ఏఈవో సిరాజ్, క్లస్టర్ ఆఫీసర్ యోగేశ్, స్థానిక రైతులు పాల్గొన్నారు.రు.



# మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

### - కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి

### - జీవో 1181ను వెంటనే ఉపసంహరించాలి - ఏఐటీయూసీ

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాకలం)

మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్మికులకు కనీస వేతనాలను పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ ఉస్మాన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో ఎంఎస్ నంబర్ 14 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరారు. 2021 జూన్ 11న జారీ చేసిన జీవో ప్రకారం గత ప్రభుత్వం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.16,600, స్కిల్డ్ కార్మికులకు రూ.20,500, హైస్కిల్డ్ కార్మికులకు రూ.22,750 వేతనాలను నిర్ణయించిందని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వేతనాలను తగ్గిస్తూ 2026 జూలై 12న జీవో ఆర్టీ నంబర్ 1181 విడుదల చేసిందని ఆరోపించారు. ఏ కార్మిక చట్టంలోనూ ఇప్పటికే ఉన్న వేతనాలను తగ్గించే నిబంధన లేదని అన్నారు.



జీవో 1181ను వెంటనే ఉపసంహరించుకొని, తగ్గించిన వేతనాలను రద్దు చేసి పాత విధానంలోనే వేతనాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు లంక శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, యమ నరసయ్య, మధురమ్మ, లక్ష్మి, బర్ల నరసయ్య, వాజిద్, గంగాధర్, నిజాం తోపాటు కార్మికులు పాల్గొన్నారు.

## ఆస్తి కోసం వేధింపులు.. మహిళ ఆత్మహత్య

### మెట్పల్లి శివారు వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యం.. భర్త, సోదరిపై కేసు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాకలం): ఆస్తి కోసం వేధింపులకు గురైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. ఉదయం గుర్తు తెలియని మృతదేహంగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా గాజులపేటకు చెందిన జక్కం రాజు (50), అతని భార్య వీరమణి (40) గుర్తించారు. మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్ కథనం ప్రకారం ఈ నెల 8న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో గొడవ జరిగిందన్నారు. అనంతరం వీరమణి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.. ఈ క్రమంలో సోమవారం ఆగస్టు 10 వీరమణి ఆచూకీ కోసం గాలిస్తుండగా మెట్ పల్లి శివారులో జక్కం రాజుకు చెందిన వ్యవసాయ బావిలో మహిళ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని వీరమణిగా గుర్తించారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా వీరమణి తమ్ముడు తోట బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరమణి కుమారుడు మృతి చెందడంతో ఆమె ఒంటరిగా ఉండేదని, ఆమె సోదరి గంగమణి, ఆమె భర్త జక్కం రాజు కలిసి ఆమె బాగోగులు చూసుకుంటామని చెప్పి కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిస్టాపూర్ గ్రామం నుంచి మెట్పల్లికి తీసుకొచ్చారని తెలిపారు. కొంతకాలంగా ఆస్తి కోసం వీరమణిని గంగమణి, జక్కం రాజు వేధించేవారని, ఇదే క్రమంలో ఆమెతో గొడవపడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని బాలరాజు ఆరోపించినట్లు పోలీసులు తెలిపారు. వారి వేధింపులు భరించలేక వీరమణి ఆత్మహత్య చేసుకున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జక్కం రాజు, గంగమణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు మెట్ పల్లి ఎస్ఐ పి. కిరణ్ కుమార్ తెలిపారు. కాగా శవ పంచనామా నిర్వహించిన అనంతరం సిఐ సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కార్మిక కర్షక రైతాంగ వ్యతిరేకి మోడీ ప్రభుత్వాన్ని

## గద్దె దించే వరకు ప్రజా పోరాటాలు ఆగవు

### - ప్రజా సంఘాల నాయకుల పిలుపు

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 10, ప్రజాకలం ప్రతినిధి

పర్వతగిరి మండల కేంద్రంలో క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశవ్యాప్త జైలు బరో కార్యక్రమం లో భాగంగా మండల కేంద్రంలో ప్రధాన రహదారి అంబేద్కర్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. నకర కంటి రామచందర్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా ముఖ్యఅతిథిగా సిఐటియు మండల కన్వీనర్ జిల్లా రమేష్ గ్రామపంచాయతీ వర్కర్స్, యూనియన్ మండల అధ్యక్షులు రామచందర్ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా నాయకురాలు గజ్జల మౌనిక మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన బిల్లులను వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని వివిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి పాత పద్ధతిలో ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలని విత్తన సవరణ బిల్లును రద్దుచేసి విద్యుత్ సంస్కరణ బిల్లు మోటార్లకు మీటర్లు పెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని రోజువారి పని దినాన్ని ఎనిమిది గంటల నుండి 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని సమ్మె హక్కును కాలరాస్తూ ఆంక్షలు విధించారని కార్మిక సంఘాల గుర్తింపు రిజిస్ట్రేషన్ కష్టతరం చేశారు. ఉద్యోగ భద్రతను పాతర వేశారు. 300 మంది లోపు పని చేస్తే కంపెనీలో కార్మికులను ఎప్పుడైనా తొలగించేందుకు హైర్, అండ్ ఫైర్ విధానాన్ని తెచ్చారని వేతనాలకోడులో కనీస వేతనాలు నిర్ణయించే మౌలిక విధానానికి



మంగళం పాడారు. అసంఘటితరంగా కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్యారెంటీ చట్టం 2005లో రూపొందింది కేంద్రం 60 శాతం రాష్ట్రం 40% నిధులు భరించాలని నిర్ణయించింది. వీటిపై ప్రజలకు అనేక భారాలు పడుతున్నాయని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక కార్మికుల పక్షాన నిర్ణయాలు తీసుకోకపోతే రాబోయే కాలంలో ప్రజలు బుద్ధి చెప్పే రోజు వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జిల్లా రమేష్, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ మండల అధ్యక్షులు నగర కంటి రామచందర్, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా నాయకురాలు గజ్జల మౌనిక, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ మండల కోశాధికారి రాపాక భాస్కర్, ఆబర్ల ఎల్లయ్య, కొయ్యల ప్రభాకర్, కొమ్ము దర్గయ్య, సాగరం, నిర్మల, లక్క శ్రీరామ్, మాసాని పూల, కల, మాలోతు నీల, మూడు రెడ్యా, ఇస్లావత్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## కుబీర్‌లో విషాదం.. చెరువులో మునిగి ఇద్దరు బాలుర మృతి

నిర్మల్, ఆగస్టు 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): కుభీర్ : సరదాగా ఈతకు వెళ్లిన ముగ్గురు బాలుర డోడర్నా చెరువు తీరని విషాదాన్ని నింపింది. కుబీర్‌కు చెందిన ముగ్గురు బాలురు డోడర్నా చెరువుకు సోమవారం ఈత కోసం వెళ్లారు. ఒక బాలుడు ఒడ్డున ఉండగా, ఇద్దరు బాలురు సోఫియాన్(10), గణేష్ 13 చెరువులోకి ఈతకు దిగారు. ఈ క్రమంలో ఇద్దరూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. స్థానికులు వెంటనే వారిని బయటకు తీశారు. సోఫియాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌ను చికిత్స కోసం బైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పిల్లల మృతితో కుబీర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## మున్సిపల్ చైర్మన్ జన్మదినం సందర్భంగా పళ్ళు పంపిణీ

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాకలం) మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి జన్మదినాన్ని పురస్కరించుకుని మెట్‌పల్లి ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలోని రోగులకు మున్సిపల్ పాలకవర్గం, మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి పండ్లు అందజేశారు. చైర్మన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోధుర్ లో తాతా మనవడి పల్లకి షార్ట్ ఫిలిం షూటింగ్...



ఇబ్రహీంపట్నం ఆగస్టు 10( ప్రజా కలం ప్రతినిధి ) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గోధురు గ్రామంలో "తాతా మనవడి నవ్వుల పల్లకి" అనే షార్ట్ ఫిల్మ్ షూటింగ్ పార్ట్ 2 ప్రారంభమైంది జరుగుతుంది నటీనటులు ప్రముఖ సినీ నటులు గోధుమ మురళి , సినిమా ఆర్టిస్ట్ చంద్రశేఖర్ గౌడ్ కథ స్క్రీన్ పై డైరెక్షన్లో జరుగుతుంది, నటీనటులు గంగాధర్ మాయ, రుచిత జోగయ్య రహీం కథల్ నరసయ్య, గోధుర్ ఫేమ్ లలితమ్మ నరసవ్వ, సాన్వి శ్రీజ,కెమెరామెన్ గని పటేల్, దర్శకులు చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ మొదటి ఎపిసోడ్ గతవారం క్రితం విడుదల అయింది ఇది పార్ట్ టు షూటింగ్ ప్రారంభమైంది ఇది ఇలా ఒక ఏడు నుంచి పది ఎపిసోడ్లు ఉంటాయని తెలియజేశారు పూర్తిగా ఒక కుటుంబ కథ ఆధారంగా నడిచే లఘు చిత్రం కొడుకు యొక్క చరిత్ర ఆ కొడుకు ఏ విధంగా ఉంటాడు ఆ కొడుకు చేసే పనులు దాని వల్ల కుటుంబానికి అయేటటువంటి బరువు భారాలు ఇవన్నీ కూడా ఏ విధంగా ఉంటాయి తర్వాత ఆ కుటుంబం ఏం జరుగుతుంది అనే కథ రూపంలో జరగడం ఉంటుందని తెలియజేశారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ప్రముఖ గాయని మంగ్లీ



జగిత్యాల్ ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజాకలం) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని ప్రముఖ జానపద, సినీ గాయని మంగ్లీ ఈరోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంగ్లీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. మంగ్లీ కొండగట్టు అంజన్నను దర్శించుకున్న విషయం తెలుసుకున్న అభిమానులు ఆమెను చూసేందుకు ఆసక్తి చూపించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



గొల్లపల్లి ఆగస్టు 10 ప్రజాకలం ప్రతినిధి

గొల్లపల్లి మండలంలోని భీంరాజుపల్లి గ్రామానికి చెందిన సింగారపు లచ్చయ్య ఇటీవల ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాగా రెక్కాడితే గానీ డొక్కడని నిరుపేద కుటుంబం పెద్దదిక్కు లచ్చయ్య మృతి చెందడంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. దీంతో ఆయన నలుగురు పిల్లలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. విషయం తెలుసుకున్న సామాజిక సేవకులు ఎన్ ఆర్ ఐ ఎడమల భోజేందర్ రెడ్డి బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించి, తన వంతు సహాయంగా కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహకారశీ అందించటానికి ఎల్లప్పుడూ ముందుంటానని బోజేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో శంకరావుపేట ఉపసర్పంచ్ గుర్రం రంజిత్ రెడ్డి, యువ నాయకుడు అవారి చందు, బొలిశెట్టి లక్ష్మణ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొమ్మెన కుమార్, తిరుపతి రెడ్డి, మహేష్, రూపేష్ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గా కమలాకర్..



మల్లాపూర్ ఆగస్టు 10 ( ప్రజా కలం ప్రతినిధి) ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్‌ను నియమించారు. ఈ మేరకు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మెట్‌పల్లిలో కమలాకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అంబేద్కర్ ఆశయ సాధనతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేయాలని నరసయ్య సూచించారు. తన నియామకానికి సహకరించిన సంఘం జాతీయ, రాష్ట్ర, డివిజన్ నాయకులకు కమలాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా కలం

మంగళవారం, ఆగస్టు 11, 2026

## విద్యావిధానంలో మార్పులు అనివార్యమా...

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు. ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్ –జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. గతంలో విద్యార్థి ఉద్యమాలు రాజకీయ పార్టీల ఆధిపత్యంలో నడిచినప్పటికీ, ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. ఈ నిరసనలు పరీక్షా సంస్కరణలకే పరిమితం కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా మారాయి. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, వరుసగా జరుగుతున్న పరీక్షా అవకతవకలు, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న నమ్మకం –ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర నిరాశను కలిగించాయి. అందువల్ల ఈ ఉద్యమం ఒక పరీక్ష గురించి మాత్రమే కాకుండా, ఒక తరం భవిష్యత్తు గురించి సాగిన పోరాటంగా మారింది ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియకూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటిస్తూ, పోలీసు చర్యలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పౌరహక్కులను గౌరవించే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యం విభేదాలను అణచివేయడం వల్ల కాదు; ప్రజల ఆందోళనలను నిర్మాణాత్మకంగా వినడం వల్ల బలపడుతుంది. సమకాలీన రాజకీయ చర్చలను ప్రభావితం చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఎంతో పెరిగింది. మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, డిజిటల్ ప్రచారాలు ప్రజల దృష్టిని ఆకర్షించే శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అయితే అవి సంక్లిష్టమైన విధాన చర్చలను అతిగా సరళీకరించే ప్రమాదం కూడా ఉంది. ప్రజాభిప్రాయం వైరల్ కథనాల కంటే ఆధారాలతో కూడిన సమాచారంపై ఆధారపడాలి. అదే విధంగా, ఇ–20 ఇథనాల్ మిశ్రమ ఇంధనం చుట్టూ జరిగిన చర్చలు ప్రజల విశ్వాసం పారదర్శకమైన శాస్త్రీయ సమాచారంపై ఆధారపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, సాంకేతిక మార్పులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు నిరంతర ప్రజా చర్చకు లోనవ్వాలి. ప్రజలకు ప్రయోజనాలు, ఖర్చులు, దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన ఆధారాలతో కూడిన సమాచారం అందించాలి. ఈ రాజీనామా భారత రాజకీయాల్లో ఒక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రజల నిరంతర ఒత్తిడి ప్రభుత్వాలను తమ నిర్ణయాలను పునఃపరిశీలించడానికి దారితీయగలదనే విషయాన్ని ఇది సూచిస్తుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది తీర్పు భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి సంఘటనలు కాలక్రమేణా పౌరులు, –ప్రభుత్వాల సంబంధాన్ని పునర్నిర్వచిస్తాయి. అత్యంత ముఖ్యంగా, భారత విద్యా సంక్షోభం ప్రశ్నాపత్రాల లీకులతో మాత్రమే పరిమితం కాదు. పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం, విద్యాసంస్థల్లో ఖాళీలు, ఉన్నత విద్యలో తగిన పెట్టుబడుల కొరత, విద్యా రంగం వాణిజ్యీకరణ– ఇవన్నీ కలిసి విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. విద్యా పరిపాలనలో సమగ్ర సంస్కరణలు లేకుండా పరీక్షా సంస్కరణలు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించలేవు. భారతదేశానికి అత్యవసరంగా సమగ్ర పరీక్షా సమగ్రత వ్యవస్థ అవసరం. సురక్షితమైన డిజిటల్ మౌలిక వసతులు, స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలు, బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు, నియామక ప్రక్రియల పారదర్శక ఆడిట్లు, పరీక్షా మోసాలపై వేగవంతమైన న్యాయ చర్యలు, సమాచార బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ, పోటీ పరీక్షలకు దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులకు మానసిక సలహా, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలి. చివరికి, ఏ విద్యార్థి ఉద్యమానికైనా నిజమైన విజయాన్ని కేవలం ఒక మంత్రి రాజీనామాతో కొలవలేం. అది శాశ్వతమైన సంస్థాగత సంస్కరణలకు దారితీస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. నిర్మాణాత్మక సంస్కరణలే శాశ్వత మార్పును తీసుకువస్తాయి. ఈ పరిణామాలు విధాన నిర్ణేతలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. విద్య అనేది కేవలం పరిపాలనా రంగం కాదు; అది కోట్లాది భారత యువత కలలు, ఆశయాలు, భవిష్యత్తుకు ప్రతీక. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో, విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు రక్షించడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడం జాతీయ ప్రాధాన్య అంశాలు మారాలి. అప్పుడే భారతదేశం ప్రజల ఆగ్రహాన్ని అర్థవంతమైన విద్యా సంస్కరణలు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనంగా మార్చగలదు.

# కర్రెగుట్టల్లో డీజీపీ పర్యటన



వాజేడు ఆగస్టు 10 (ప్రజాకలం) వాజేడు,వెంకటాపురం మండలంలోని కర్రెగుట్టలో తెలంగాణ డిజిపి సివి ఆనంద్ పర్యటించారు. పాముసూరు బేస్ క్యాంప్ సందర్శించి, గ్రామస్తులతో మాట్లాడి,7 కుటుంబాలు 21మందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు,కర్రెగుట్టలోని తెలంగాణ బోర్డర్ లో జాతీయ జెండాని డిజిపి ఆవిష్కరించి,పావురాలను,మూడు రంగుల బెలూన్స్ నీ అడవిలోకి ఎగరవేసిన అనంతరం చతిస్గడ్ రాష్ట్రంలోని 196 సీఆర్పీఎఫ్ బెటాలియన్ క్యాంపు పరిశీలించి చతిస్గడ్ పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీజీపీ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ ఫారెస్ట్ రెవెన్యూ ప్రభుత్వ శాఖ సంబంధించిన అధికారులు అందరూ ఈ ఒక కర్రెగుటలో రోడ్డు నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేశారని అభినందించారు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కాగర్ తో 50 సంవత్సరాల నుండి కర్రెగుట్టలో ఉంటున్న మావోయిస్టులు కంచుకోటగా ఏర్పరచుకున్న ఈ బీకరమైన అరణ్యంలో ఇప్పుడు రోడ్డు నిర్మించి అభివృద్ధి చెందుతుందని ఇక్కడ ఉంటున్న గ్రామస్తులకు ఉపాధి కల్పిస్తామని డిజిపి తెలిపారు.

ఈ కర్రెగుటలలోకి రావాలంటే కోబ్రా గ్రేహౌండ్స్ పోలీసులు వచ్చి కుంబింగ్ చేసి వెళ్లేవాళ్లు అటువంటి ప్రదేశంలో ఇప్పుడు పోలీస్ యంత్రాంగం వచ్చిందంటే ఆపరేషన్ కగార్ తో మావోయిస్టు అగ్ర నాయకులందరూ లొంగిపోవడంతో మావోయిస్టు కంచుకోటగా ఉన్న ప్రదేశంలో ఇప్పుడు క్యాంపులు నిర్వహించి రోడ్డు వేసి అభివృద్ధి బాటలో నిలుస్తుందని అన్నారు ఇంకా ఒకరో ఇద్దరో ఉంటే వాళ్లు కూడా లొంగిపోవాలని వాళ్లకు వచ్చే బెనిఫిట్స్ పై అవగాహన చేసి ఇస్తున్నామని డిజిపి సివి ఆనంద్ తెలిపారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ గద్దె కూల్చివేతను

## తీవ్రంగా ఖండించిన పట్టపురం ఏకాంతం గౌడ్

(వరంగల్/పర్వతగిరి) ఆగస్టు 10, ప్రజాకలం ప్రతినిధి.

నర్సంపేట మెడికల్ కాలేజీ ముందు సొంత ప్రదేశంలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ఎమ్మెల్యే, ప్రజానేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ గద్దెను అనుమతి లేదనే కారణంతో కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ మండల పార్టీ వరంగల్ గ్రేన్ మార్కెట్ ఏఎంసి మాజీ డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పెద్ది సుదర్శన్ రెడ్డి కి నివాళిగా ఏర్పాటు చేసిన విగ్రహ గద్దెను కూల్చివేయడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అభిమానం, స్థానికుల మనోభావాలను గౌరవించి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ ఘటనపై తగిన న్యాయం చేయాలని పట్టపురం ఏకాంతం గౌడ్ డిమాండ్ చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాలను, ప్రజల అభిమానాన్ని ఎవరూ కూల్చివేయలేరు అని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజల మనోభావాలను గౌరవించకుండా వ్యవహరిస్తే త్వరలోనే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజల అభిమానం, ఆత్మగౌరవంతో ముడిపడిన పెద్ది సుదర్శన్ రెడ్డి గారి జ్ఞాపకాలను అణచివేయాలని చూస్తే అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కోసం ఏర్పాటు చేసిన గద్దెను తిరిగి ఏర్పాటు చేసి, విగ్రహ ఆవిష్కరణకు సహకరించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే పెద్ది సుదర్శన్ రెడ్డి గౌరవం కోసం మరో ఉద్యమాన్నైనా నర్సంపేట నుంచే ప్రారంభిస్తామని పట్టపురం ఏకాంతం గౌడ్ స్పష్టం చేశారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ

# మండల కేంద్రంలో భారీ ధర్నా

**- పాల్గొన్న వివిధ ప్రజా సంఘాల నాయకులు**

**- అల్వాల వీరయ్య గుండాగాని మధుసూదన్ జిన్నా లచ్చయ్య**



మరిపెడ ప్రజా కలం న్యూస్ ఆగస్టు 10

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో భారీ ర్యాలీ రాస్తారోకో నిర్వహించామని సిపిఎం పార్టీ మండల నాయకులు గుండాగాని మదుసూదన్ అన్నారు ఈ సందర్భంగా వివిధ రకాల ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను ధారా దత్తం చేస్తూ, దేశంలో పనిచేస్తున్న కార్మికులకు భారత రాజ్యాంగం ప్రకారం కనీస వేతనం 2006 వేల రూపాయలు ఇవ్వాలని, దేశంలో అనేక రాష్ట్రాలలో స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి ఈ ఎస్ ఐ,పి ఎఫ్ కనీస వేతనం వర్తింప చేయాలి అని, మున్సిపాలిటీ గ్రామపంచాయతీ కేంద్రాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, తెలంగాణ రాష్ట్రంలో అనేక ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, అదేవిధంగా ఉపాధ్యాయుల కొరతను పాఠశాలలో తరగతి భవనాలను, ప్రతి పాఠశాలకి అటెండర్ నూ తక్షణమే ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలకు మౌలిక సదుపాయాలు కల్పించి ప్రొఫెసర్ కొడుత నూ తీర్చాలి అని, ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గారంటీల్నినూ తక్షణమే అమలు చేయాలని, అభిప్రాయపడ్డారు ఇటీవల కాలంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేసిన సర్వేలలో అనేక స్థానిక సమస్యలు తెలుగులోకి వచ్చేయాలి, స్థానిక మండల మున్సిపాలిటీలో సమస్యలనూ పరిష్కరించాలి అని, అదేవిధంగా గ్రామాల్లో అనేక గ్రామపంచాయతీలో నిధులు కేటాయించాలని ఈ జైలు భరో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించామని తెలియజేశారు ప్రభుత్వాలు ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించుకుంటే మళ్ళీ దశలవారీగా ఉద్యమం చేసి సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని మరోమారు హెచ్చరించారు

## మోదీ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి

**- జైల్‌భరో కార్యక్రమం విజయవంతం**

**- తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మాతరావు**




పాలేరు ఆగష్టు 10( ప్రజా కలం న్యూస్)

కూసుమంచి కేంద్రంలోని సోమవారం బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మల్లెల సన్మాతరావు పిలుపునిచ్చారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు. పద్మారెడ్డి భవన్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సన్మాతరావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు–2025ను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావడంతో పాటు సమగ్ర రుణమాఫీ అమలు చేయాలని కోరారు. అనంతరం నిరసనలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



తానూర్,ఆగస్టు 10(ప్రజా కలం): మండలంలోని మొగిలి గ్రామంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి సోమవారం పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు, గ్రామానికి చెందిన మాధవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సానుభూతి తెలిపారు, అనంతరం గ్రామానికి సుదీర్ఘకాలం కారోబరిగా సేవలందించిన భుజంగ్ సింగ్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో, వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉష–దర్శన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సాగర్–రాజన్న, మాజీ ఆత్మ చైర్మన్ పోతరెడ్డి, మాజీ సర్పంచ్ పుండాలిక్, మాజీ ఎంపీటీసీ లచ్చన్న కాకా, మానిక్, ఏ. సాయినాథ్, జె. లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, లక్ష్మణ్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కోలూర్ తండా సర్పంచ్ గణేష్, బాబురావు, భీమ్‌రావు తదితరులు పాల్గొన్నార.

## 33 ఏళ్ల తర్వాత కలిసిన గురు–శిష్యులు

**ధరూర్ జడ్పీహెచ్ఎస్‌లో 1993–94 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం**




ప్రజా కలం ఆగస్టు 10 (గద్వాల ప్రతినిధి) ధరూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1993–94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత తమ గురువులు, సహచరులను కలుసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, విజయ్ బాబు, వెంకటరమణ, శ్రీనివాసరావు, లక్ష్మిరెడ్డి, గురురాజారావు పాల్గొని విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా మాట్లాడారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు నరేష్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించడంతో పాటు పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, లైబ్రరీకి పుస్తకాలు అందించాలని నిర్ణయించారు. అనంతరం గురు–శిష్యులు కలిసి సామూహిక ఫొటో దిగారు. 33 ఏళ్ల తర్వాత గురువుల ఆశీర్వాదం తీసుకోవడం తమకు మరిచిపోలేని అనుభూతి అని పూర్వ విద్యార్థులు తెలిపారు.

## కోలూర్ లో ముమ్మరంగా దోమల నివారణ చర్యలు: సర్పంచ్ మాధవరావు చొరవ

తానూర్, ఆగస్టు 10(ప్రజా కలం): వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించకుండా కోలూర్ గ్రామంలో ముందస్తుగా పారిశుధ్యం, దోమల నివారణ చర్యలు చేపట్టారు, గ్రామంలోని మురికి కాలువలను శుభ్రం చేయించి, వీధుల్లో ఫాగ్ స్ప్రే చేయించారు, సర్పంచ్ మాధవరావు స్వయంగా చొరవ తీసుకుని ఈ పనులను పర్యవేక్షించగా, ఆయన కృషిని గ్రామస్థులు అభినందించారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, కారోబార్ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు



## 1990 బ్యాచ్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏ ఎస్ ఐ లుగా పదోన్నతి

**- వారిని అభినందించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**

నిర్మల్ ఆగస్టు 10(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న 1990 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్ ఏ ఎస్ ఐలుగా పదోన్నతి లభించింది. పదోన్నతి పొందిన వారిలో హెచ్ సి 1285 ఎస్.ఎస్. చంద్రప్రకాష్ – మామడ పోలీస్ స్టేషన్, హెచ్ సి 547 ఎస్. చంద్రశేఖర్ – నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్, హెచ్ సి 448 ఏ. సాయన్న – సోన్ పోలీస్ స్టేషన్ ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందించిన సేవలను ఎస్పీ అభినందించారు. పదోన్నతి అనేది సిబ్బంది కృషి, అంకితభావానికి గుర్తింపుగా భావించాలని, నూతన హోదాలో మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆమె సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం, బాధ్యతాయుతమైన విధి నిర్వహణతో నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, తో పాటు భైంసా ఏ ఎస్ పి సాయి కిరణ్, ఐపీఎస్ పాల్గొని పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించారు.



# ఆర్డీఎఫ్ జూనియర్ కళాశాలలో ఘనంగా వెల్కమ్ డే పార్టీ

## - విద్యార్థుల ఆటపాటలతో సందడిగా మారిన కళాశాల ప్రాంగణం




(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 10, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలోని ఆర్డీఎఫ్-వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాలలో సోమవారం వెల్కమ్ పార్టీని ఘనంగా నిర్వహించారు. నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి కళాశాల పూర్వ విద్యార్థి, బంధనపల్లి గ్రామ సర్పంచ్ అక్రి రామ్‌జీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అక్రి రామ్‌జీని శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. గత విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినుల తల్లిదండ్రులను ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం ఎంతో కీలకమని అధ్యాపకులు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు కళాశాలలో సముచిత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలకు అనుగుణంగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తున్నారని చెప్పారు. కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న హాస్టల్ వసతి, విద్యా సౌకర్యాలు, భద్రత, నిత్య పర్యవేక్షణ తదితర అంశాలను వివరించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి విద్యతో పాటు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కల్పించడమే కళాశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కళాశాలలో లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. వెల్కమ్ పార్టీ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థినులు చేసిన ఉపన్యాసాలు, పాటలు, నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించడంతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థుల ప్రతిభను చూసిన అతిథులు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అక్రి రామ్‌జీ విద్యార్థులను అభినందిస్తూ, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాలలో లభిస్తున్న విద్యా, ఇతర సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ. రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సతీష్, అధ్యాపకులు జయశంకర్, మహేశ్వర్, సైదులు, సంతోష్, దంజ్య, విల్సన్ బాబు, వేణు, గుంషావలి, ప్రవీణ్, శ్రీలత, ధనలక్ష్మి, తిరుమల, పిడి బి.రాజు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలు, ముఖ్య అతిథి సన్మానం, ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రుల అభినందనలతో వెల్కమ్ పార్టీ అత్యంత ఆహ్లాదకరంగా సాగింది.

# పాలేరు నీటికి కటకట !

## - తాగునీటికే ప్రాధాన్యం.. సాగుకు నీరివ్వడం కష్టమే

## - సాగర్‌లో నీటి కొరతతో ఇన్‌ఫ్లోకు బ్రేక్.. పాలేరు జలాశయాన్ని పరిశీలించిన ఐబీ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు.



పాలేరు ఆగస్టు 10(ప్రజా కలం న్యూస్)

పాలేరు జలాశయంలో నీటి లభ్యత తగ్గిపోవడంతో తాగునీటి అవసరాలకే ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాల్సిన పరిస్థితి నెలకొందని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. సాగర్‌లో నీటి లభ్యత లేకపోవడం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీటి కోసం పాలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయడం ప్రస్తుతం కష్టమేనని ఆయన స్పష్టం చేశారు. కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయాన్ని సోమవారం ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. సాగర్ ఇన్‌ఫ్లో కాలువ, రంగుల బ్రిడ్జి వద్ద ఉన్న గేట్లు, పెద్దకాలువ, పాతకాలువ గేట్లను పరిశీలించి నీటి పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సాగర్ నుంచి నీరు వస్తేనే..

ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం భద్రపరుస్తామని ఎస్ఈ తెలిపారు. సాగర్ నుంచి నీటి విడుదల లేకపోవడంతో సాగునీటికి నీటిని విడుదల చేయడం సాధ్యం కాదన్నారు. ఒకవేళ సాగర్ నుంచి నీటి విడుదల జరిగితే పాలేరు జలాశయాన్ని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో నింపి, ప్రభుత్వం ఆదేశాల మేరకు సాగునీటిని విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

నీటిని కాపాడేందుకు చర్యలు

ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటిని భద్రపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఈ వెల్లడించారు. జలాశయంలో నీటి నిల్వలు, గేట్ల పరిస్థితి, కాలువల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఈఈ, జేఈలు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వరంగల్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులును వేగవంతం చెయ్యాలి

## కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కలిసి,కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ బీజేపీ బృందం!

వరంగల్ , ఆగస్టు 10, ప్రజాకలం ప్రతినిధి :-

వరంగల్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులును వేగవంతం చెయ్యాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని తెలంగాణ బీజేపీ బృందం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్-మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక ఆమోదం తెలిపినందుకు గాను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తో పాటు మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారామ్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్,ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా వన్నాల వెంకటరమణ లతో కూడిన బీజేపీ నాయకుల బృందం న్యూఢిల్లీలో జోర్బాగ్ సాఫదారగంజ్ లోని కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యాలయంలో మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఒక అధికారిక లేఖ అందజేశారు. తెలంగాణ ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజల దశాబ్దాల కాలం నాటి చిరకాల వాంఛ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చూపిన చొరవ, ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. తాను మహబూబాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో వరంగల్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని, ఈ రోజు ఆ కల నెరవేరుతుండటం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని లేఖలో ఆజ్మీరా స్మరించుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన కొత్తలో కేంద్ర మంత్రితో జరిగిన భేటీని గుర్తుచేసుకుంటూ..రామ్మోహన్ నాయుడి నిరాడంబరత, అందుబాటులో ఉండే స్వభావం మరియు చురుకైన నాయకత్వం స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ఈ చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని వరంగల్ పర్యటనకు విచ్చేయాల్సిందిగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను బీజేపీ బృందం ఆహ్వానించింది.



మామునూరు విమానాశ్రయ ప్రాజెక్టు శంకుస్థాపన లేదా అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై,ఈ ప్రాంత ప్రజలను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి రాక తెలంగాణ ప్రాంత అభివృద్ధికి,కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుండగా అదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి వెంటనే శ్రీకారం చుట్టాలని అదిలాబాద్ లోకసభ సభ్యులు గోడెం నగేష్ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను కోరారు. అలాగే మామునూరు విమానాశ్రయంలో భూములు కోల్పోయిన కుటుంబాలకు మరియు సమీప ప్రాంతం లోని ప్రజలకి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మరియు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణలి లు మంత్రి ని కోరారు. వీరి విజ్ఞప్తులను అంగీకరించి కేంద్ర మంత్రి పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రివర్యులను బీజేపీ బృందం సత్కరించింది.

# గోవా గవర్నర్ పుసపాటి అశోక్ గజపతి రాజును కలిసిన డా. కడవెండి వేణుగోపాల్

## - ప్లాస్టిక్ రహిత భారత్ , పర్యావరణ పరిరక్షణపై చర్చ.

ఖమ్మం ఆగష్టు 10(ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం ప్రాంతానికి చెందిన ఎకో - క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ వ్యవస్థాపకులు ఒ అధ్యక్షులు డా. కడవెండి వేణుగోపాల్ తన సతీమణి శ్రీమతి అరుణ కడవెండితో కలిసి గోవా గవర్నర్ శ్రీ పుసపాటి అశోక్ గజపతి రాజును లోక్ భవన్ (రాజ్ భవన్) గోవాలో కలిశారు . దాదాపు ఒక గంట పాటు జరిగిన ఈ సమావేశంలో వివిధ పర్యావరణ సమస్యలపై చర్చించి , పర్యావరణ పరిరక్షణను మరింత బలోపేతం చేయడం , ప్లాస్టిక్ రహిత భారత్ సాధనను ప్రోత్సహించడంపై తన దృష్టికోణాన్ని గవర్నర్‌కు వివరించారు . ఎకో - క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాల గురించి ఆయన వివరించారు . ప్రజల్లో పర్యావరణ అవగాహన కార్యక్రమాలు , ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు ప్రచారాలు , పర్యావరణ విద్య , విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలు , వాతావరణ మార్పులపై అవగాహన , సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలను వివరించారు . అలాగే పర్యావరణ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు , పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం నుంచి మద్దతు , ప్రోత్సాహం కల్పించాలని కోరుతూ డా. కడవెండి వేణుగోపాల్ గవర్నర్‌కు రిప్రెసెంటేషన్ (పత్రాన్ని) సమర్పించారు . ఈ సమావేశంలో ముఖ్యమైన ఘట్టంగా



గౌరవనీయ గవర్నర్ శ్రీ పుసపాటి అశోక్ గజపతి రాజు “ప్లాస్టిక్ రహిత భారత్” బ్యానర్‌ను ఆవిష్కరించారు . ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టేందుకు సమిష్టి చర్యలు అవసరమని , భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందనే సందేశాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది . ఈ సందర్భంగా డా. కడవెండి వేణుగోపాల్ మరియు శ్రీమతి అరుణ కడవెండి గౌరవనీయ గవర్నర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు . పర్యావరణ బాధ్యత , సుస్థిర అభివృద్ధి , ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు , పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై జరిగిన ఈ సమావేశం ఫలవంతంగా మరియు ప్రోత్సాహకరంగా సాగింది . ప్లాస్టిక్ రహిత భారత్ కార్యక్రమానికి గౌరవనీయ గవర్నర్ అందించిన ప్రోత్సాహానికి డా. కడవెండి వేణుగోపాల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# డాక్టర్ ప్రియాంక అంతిమయాత్రలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే బండ్ల

## - నిందితులకు కఠిన శిక్ష విధించాలి.. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన న్యాయం చేయాలి




ప్రజా కలం ఆగస్టు 10 (గద్వాల ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం లోని ఐజ మండల కేంద్రంలో నిర్వహించిన డాక్టర్ ప్రియాంక అంతిమయాత్రలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొని ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రాజమండ్రిలో జరిగిన డాక్టర్ ప్రియాంక ఘటన అత్యంత దుర్మార్గమైనదని అన్నారు. ఘటనకు కారణమైన నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని శిక్ష పడేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ ప్రియాంక హత్య కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరితగతిన విచారించి, నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కేసు విచారణను ఆలస్యం చేయకుండా బాధిత కుటుంబానికి త్వరగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల భద్రతకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. డాక్టర్ ప్రియాంక ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు, విక్రమ్ సింహా రెడ్డి పాల్గొన్నారు.

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేయాలి

## గద్వాలలో కార్మిక, రైతు సంఘాల జైల్‌భరో.. రాస్తారోకో



ప్రజా కలం ఆగస్టు 10 గద్వాల ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక హక్కులను బలహీనపరిచే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం, ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల రుణ విమోచన చట్టం తీసుకురావాలని, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య మద్దతు తెలిపారు. తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గోపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, సీఐటీయూ నాయకులు ఉప్పేర్ నరసింహ, వీవీ నరసింహ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.నరసింహ, జి.రాజు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదన్నతో పాటు వివిధ కార్మిక, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయండి

## సుమారుగా లక్ష మంది ఉద్యమకారులకు న్యాయం చేయండి

## మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొస్తాం - డాక్టర్ పిడమర్తి రవి , డాక్టర్ కె.వి కృష్ణారావు.

ఖమ్మం ఆగష్టు 10(ప్రజా కలం న్యూస్ ) రెండు తరాల తెలంగాణ ఉద్యమాకారులను సుమారుగా లక్ష మందిని గుర్తించండి కాంగ్రెస్ మళ్ళీ గెలుస్తుందని , అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపును వేగవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పిడమర్తి రవి , డాక్టర్ కె.వి కృష్ణారావు అన్నారు . చిన్నారి హాస్పిటల్ డైరెక్టర్ ఆఫీస్ లో రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనం కరపత్రాన్ని జమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి , తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ కె.వి కృష్ణారావు మరియు మిగతా నాయకులతో కలిసి ఆవిష్కరించారు . తెలంగాణ రాష్ట్రంలో అమరవీరుల కుటుంబాలు ఉద్యమంలో గాయపడిన వారు ఆగిపోయింది జైలుకుపోయిన వారు ఉద్యమం నడిపిన వారు సంఘాలు ఏర్పాటు చేసిన వాళ్లు అందరిని కలిపి లక్ష మందిని గుర్తించాలని వారికి 250 చదరపు గజాల స్థలం మరియు పెన్షన్ , గుర్తింపు కార్డులు ఇవ్వాలని పిడమర్తి రవి కోరారు . సెప్టెంబర్ 16న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే అపూర్వ సమ్మేళనానికి 1969 - 2009



ఉద్యమకారులు హాజరుకావాలని కోరారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు దేవి రెడ్డి విజయ్ , మట్టి గురుమూర్తి , జిల్లా విజయ్ , రాకేష్ , భూక్య హరినాయక్ తదితరులు పాల్గొన్నారు .

# తెలంగాణ, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఢిల్లీలో కేంద్రమంత్రులకు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి వరుస విజ్ఞప్తులు

## - ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ‘పీఎం-సేతు’ హబ్ కేటాయించాలి

## - రక్షణ కారిడార్‌కు ఆమోదం తెలపాలని కోరిన రామసహాయం.

ఖమ్మం ఆగష్టు 10(ప్రజా కలం న్యూస్ )

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల సాధన, పారిశ్రామికాభివృద్ధి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ?ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ‘పీఎం-సేతు’ హబ్ కేటాయించాలని కేంద్ర కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు. పరిశ్రమలు కేంద్రీకృతమైన ప్రాంతాలకే ఐటీఐల ఆధునీకరణ పరిమితం కాకుండా, గ్రామీణ, గిరిజన ప్రాంతాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాన డిమాండ్లు

ఖమ్మం-కొత్తగూడెం క్లస్టర్:

ఖమ్మం ఐటీఐని హబ్‌గా గుర్తించి, కొత్తగూడెం తదితర ఐటీఐలను స్పోక్స్‌గా అనుసంధానించాలి.

అగ్రి-టెక్ హబ్: ఖమ్మంలో మిరప ప్రాసెసింగ్, ఫుడ్-ప్రాసెసింగ్ స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి.

కొత్తగూడెంలో మైనింగ్ శిక్షణా కేంద్రం: కొత్తగూడెంలో ప్రత్యేకంగా ‘ట్రైబల్ స్కిల్ అండ్ ఎనర్జీ ఒ మైనింగ్ సెంటర్’ను ఏర్పాటు చేయాలి.

ఆధునిక కోర్సులు: ఈవీలు, సోలార్ ఎనర్జీ, డ్రోన్లు, రోబోటిక్స్ కోర్సులు ప్రవేశపెట్టాలని కోరారు. హైదరాబాద్-బెంగళూరు రక్షణ కారిడార్‌కు ఆమోదం తెలపండి: కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరిన ఖమ్మం ఎంపీ, నేతలు హైదరాబాద్-బెంగళూరు రక్షణ పారిశ్రామిక కారిడార్‌ను రక్షణ, ఏరోస్పేస్ కారిడార్‌గా అధికారికంగా ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిని పునరుద్ఘాటిస్తూ కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను తెలంగాణ బృందం కలిసింది. తెలంగాణలో ఏరోస్పేస్ ఎగుమతులు 100 శాతం వృద్ధిసాధించాయని, దీనికి ఆమోదం తెలపాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, మహబాద్ ఎంపీ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రియాంక మృతిపై ఓయూలో కొవ్వొత్తుల నిరసన

### మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి: జై నడిగడ్డ యువత



ప్రజా కలం ఆగస్టు 10 గద్వాల ప్రతినిధి:వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక మృతికి ఉస్మానియా యూనివర్సిటీలో జై నడిగడ్డ యువత ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. విద్యార్థి నాయకులు గౌనింటి వినోద్ కుమార్ తదితరులు ప్రియాంక చిత్రపటానికి నివాళులు అర్పించారు. ప్రియాంక మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి రూ.5 కోట్ల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మద్యం, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జై నడిగడ్డ యువత నాయకులు గౌనింటి వినోద్ కుమార్, క్రాంతి, శేఖర్, జగదీష్, అన్వార్, మల్లేష్, త్రినేష్, బ్రహ్మేష్, లక్ష్మన్న, హుస్సేన్, గోపి, ఈశ్వర్తో పాటు జిల్లాకు చెందిన పలువురు విద్యార్థి మిత్రులు పాల్గొన్నారు.

## యాగాలతో కాదు.. నీటి నిర్వహణతోనే రైతులకు భరోసా

### నీటి కొరతపై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి: డా. కురువ విజయ్ కుమార్



ప్రజా కలం ఆగస్టు 10 గద్వాల ప్రతినిధి: వరుణ యాగం నిర్వహించడంపై తమకు అభ్యంతరం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా. కురువ విజయ్ కుమార్ అన్నారు. అయితే గతంలో వచ్చిన వరద నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లు, చెరువులు నింపి ఉంటే నేడు నీటి కొరత పరిస్థితి ఎందుకు వచ్చేదని ప్రశ్నించారు.
రైతులకు యాగాలు మాత్రమే కాకుండా పొలానికి నీరు, పంటకు భరోసా కావాలన్నారు. వరుణుడు ఇచ్చిన నీటిని ఒడిసిపట్టుకోలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. నీటి నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## తల్లాడ వీడీసీ చైర్మన్ రెడ్డెం రామకృష్ణారెడ్డిని సన్మానించిన స్నేహితులు



తల్లాడ ఆగస్టు 10 ప్రజా కలం న్యూస్
తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ రెడ్డెం రామకృష్ణారెడ్డిని తన తోటి పదవ తరగతి విద్యార్థులు సన్మానం చేశారు. సోమవారం నారాయణపురంలోని ఆయన నివాసం వద్ద పూర్వ విద్యార్థులు ఒక్కటై రామకృష్ణారెడ్డి దంపతులను శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతో కలిసి చదివిన స్నేహితునికి ఈ పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు జమలయ్య, ఉదయశ్రీ, శ్రీనివాసరావు, రమేష్, భాస్కర్ రావు, శివరామచంద్రమూర్తి, వెంకటేశ్వర్లు, రవి, అజయ్ కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ప్రత్యేక అలంకరణలో చిన్నారులు

### కనకదుర్గ, గోదాదేవి, భారత్ మాత అవతారలో చిన్నారులు



ఖమ్మం/తల్లాడ ఆగస్టు 10 ప్రజా కలం న్యూస్
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బోనాల జాతరలో తల్లాడ చిన్నారులు ప్రత్యేక అవతారాలలో కనిపించారు. తల్లాడ పట్టణానికి చెందిన పలు చిన్నారులు కనకదుర్గ, గోదాదేవి, భారత్ మాత అవతారంతో బోనాలు జాతరలో పాల్గొన్నారు. సాక్షాత్తు అమ్మవారి అవతారాలతో పలువురుకి అమ్మవారి దర్శనం కల్పించి ప్రత్యేక అలంకరణగా నిలిచారు. చిన్నారులను ప్రత్యేకంగా అలంకరించిన బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలను ప్రత్యేకంగా అభినందించారు.

## బసవయ్యకు నివాళులు అర్పించిన అడపా అనిల్ చౌదరి

తల్లాడ ఆగస్టు 10 (ప్రజా కలం న్యూస్): తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామంలో తూము బసవయ్య దశదిన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా యువజన నాయకుడు అడపా అనీల్ చౌదరి పాల్గొని ముతుమ్ లక్ష్మి, బసవయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా 6వ వార్డు సభ్యులు వీరబాబు ముదిరాజ్ కూడా కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ప్రతాప్. వెంకటేశ్వర్లు.నాయకులు, కల్యాణపు వెంకటయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలసిన ఎటపాక టీడీపీ పార్టీ నాయకులు

### చింతూరు డివిజన్లో పలు సమస్యలును చంద్రబాబు దృష్టి కి తీసుకెళ్లిన తోటకూరి శ్రీనివాస రావు, తోటకూరి సంజు చౌదరి లు



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, ఆగస్టు 10:
ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని మర్యాద పూర్వకముగా కలిసిన ఎటపాక మండలం టీడీపీ పార్టీ నాయకులు తోటకూరి శ్రీనివాసరావు, తోటకూరి సంజులు. ఈ సందర్భంగా ఎటపాక మండలంలో ఉన్న రెవెన్యూ పెండింగ్ సమస్యలను గురించి వివరించడం జరిగింది. అలానే చింతూరు డివిజన్ లో ఆర్టీసీ బస్ లు తక్కువ గా తిరుగుతుండడం వలన ప్రయాణికులు ఇబ్బంది పడుచున్నారని, ప్రస్తుతం 3 బస్సులు ఉండగా మరో 5 బస్సులు కేటాయించాలని,అలానే శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం భూములు తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు ఆక్రమించుకోటానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వ్యక్తుల నుండి దేవాలయ భూములను కాపాడాలనీ కోరారు. అలానే చింతూరు డివిజన్ లో ఉన్న ఎస్సి, బీ సీ మైనారిటీ వారికీ ఇల్లులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలనీ కోరారు. 11 కే వి విద్యుత్ లైన్ కి సబ్ స్టేషన్ మంజూరు చేయాలని కోరారు. ఎటపాక మండలంలో ముంపు గ్రామాలను పోలవరం 41 కాంటూర్ లో కలిపి వరద నుండి ప్రజలను కాడాలని కోరారు. ముఖ్యమంత్రికి చింతూరు డివిజన్ లో పలు సమస్యలపై వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి వర్యులు ఈ సమస్యలు పై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కారంచేస్తానని హామీ ఇచ్చారు.

## కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ఆళ్లపల్లిలో అసంఘటిత కార్మికుల ర్యాలీ

### - సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన - 4 లేబర్ కోడ్ల రద్దు డిమాండ్




ఆళ్లపల్లి, ఆగస్టు 10, ప్రజాకలం
కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, కొమరం హనుమంతు పాల్గొని ప్రసంగించారు. 2025 నవంబర్ 21న కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చి 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందని, దీనివల్ల కార్మికులు, ఉద్యోగులపై పనిభారం పెరిగిందని ఆరోపించారు. జీతభత్యాలు పెరగడం లేదని, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు IKP, VVOA, అంగన్వాడి, ఆశా, మిడ్-డే మీల్స్ కార్మికులపై పనిభారం అధికమైందని, 8 గంటల పనిని 12 గంటలకు పెంచుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వీరికి గౌరవ వేతనాన్ని 18,500 నుండి 26,000 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో చేస్తున్న మార్పులతో వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతింటోందని, నూతన విద్యా విధానంతో విద్యారంగం పూర్తిగా కార్పొరేటీకరణ అవుతుందని, విద్యుత్ సవరణ బిల్లుతో విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఈ విధానాలన్నింటికీ నిరసనగా కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 10న దేశవ్యాప్తంగా "జైల్ భరో" కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు
ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి IKP VVOA మండల అధ్యక్షులు దొడ్డి రాము, CITU నాయకులు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుగుణ, బోజమ్మ, సుభద్ర, జయశ్రీ, శిరీష, పార్వతి, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు

## భద్రాచలం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షురాలు గా శెట్టి జయమ్మ




ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, ఆగస్టు 10 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం నియోజకవర్గంలో భద్రాచలం ప్రాంతానికి చెందిన శెట్టి జయమ్మ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ జిల్లా అధ్యక్షురాలు గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శెట్టి జయమ్మ మాట్లాడుతూ, పార్టీ నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను అని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడం గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. అలాగే నాకు ఈ అవకాశం కల్పించిన తెలంగాణా రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్,భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పోదేం వీరయ్య కు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు,కాంగ్రెస్ పార్టీ అభిమానులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పోగొట్టుకున్న వస్తువులు.. సీఈఐఆర్‌తో తిరిగి స్వాధీనం

### రూ.65 వేల విలువైన మొబైల్, సర్వే మిషన్‌ను బాధితుడికి అందజేసిన పోలీసులు



ప్రజా కలం ఆగస్టు 10 (గద్వాల ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మంగంపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ లైసెన్స్‌డ్ సర్వేయర్ కురువ వెన్నయ్యకు చెందిన పోగొట్టుకున్న మొబైల్ ఫోన్, సర్వే మిషన్‌ను మల్దకల్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించారు.జూలై 11న వెన్నయ్య సర్వే పనుల నిమిత్తం మంగంపేట నుంచి గద్వాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అమరవాయి–బూడిదపాడు గ్రామాల మధ్యలో ఆయన బ్యాగ్ పడిపోయింది. అందులో రూ.15 వేల విలువైన వివో మొబైల్ ఫోన్, రూ.50 వేల విలువైన సర్వే మిషన్ ఉన్నాయి. దీనిపై వెన్నయ్య మల్దకల్ ఎస్ఐ శ్రీహరికి ఫిర్యాదు చేయగా, ఎస్ఐ సూచనల మేరకు కానిస్టేబుల్ విజయరాజు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. అనంతరం పోగొట్టుకున్న వస్తువులను గుర్తించి మొత్తం రూ.65 వేల విలువైన మొబైల్ ఫోన్, సర్వే మిషన్‌ను బాధితుడు కురువ వెన్నయ్యకు పోలీసులు అప్పగించారు.

# "శతశాతం"తో విద్యలో విప్లవం

### - వంద స్కూల్లకు విస్తరణ - ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
### - ఎమ్మెల్యే యెన్నం విద్యా యజ్ఞ రూప శిల్పి: వందేమాతరం ఫౌండర్ రవీందర్




మహబూబ్ నగర్
ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 10
గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా " శతశాతం " కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మంచి సంకల్పంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం నేడు జిల్లా, రాష్ట్ర స్థాయిని దాటి ఖండాంతర స్థాయిలో గుర్తింపు పొందడం, ఆట ( అమెరికా తెలుగు అసోసియేషన్) వారి కమ్యూనిటీ సర్వీస్ అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. ఇది ఒక్కరి విజయం కాదని, సమిష్టి కృషి ఫలితమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని లాభాపేక్ష లేకుండా చేపట్టిన ఈ "శతశాతం" కార్యక్రమానికి సమాజంలోని అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు రావడం విశేషమని పేర్కొన్నారు. తన సొంత నిధులతో, విద్యాశాఖ సహకారంతో ఎంపిక చేసిన వందమంది విద్యా వాలంటీర్లకు మూడు రోజులపాటు సమగ్ర శిక్షణ అందించినట్లు తెలిపారు. వాలంటీర్ల బాధ్యతలు, విద్యా వ్యవస్థతో మమేకమవడం, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు సహకారం అందించడం వంటి అంశాల పై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సబ్జెక్ట్ నిపుణులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను రిసోర్స్ పర్సన్లుగా తీసుకురావడంతో పాటు, సైకాలజిస్టుల సహకారంతో పిల్లల మనోభావాలను అర్థం చేసుకునే విధంగా శిక్షణ అందించినట్లు వెల్లడించారు. మూడు రోజుల శిక్షణ అనంతరం వాలంటీర్లు తమకు కేటాయించిన పాఠశాలల్లో "శతశాతం" కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. గత ఏడాది 30 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి అద్భుత ఫలితాలు సాధించినట్లు చెప్పారు. పాస్ అవుతారా లేదా అనుకున్న విద్యార్థులు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించడం, 500కు పైగా మార్కులు పొందడం, 16 మండలాల్లో 16 మంది టాపర్లను అందించడం ఈ కార్యక్రమ విజయాన్ని సూచిస్తుందని ఆయన వివరించారు. ఈ విజయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది కార్యక్రమాన్ని 100 పాఠశాలలకు విస్తరించినట్లు తెలిపారు. ఈ శతశాతం కార్యక్రమం ద్వారా దాదాపు 16 వేల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వందేమాతరం ఫౌండేషన్, విద్యాశాఖ అధికారులు, డీఈఓ, ఇతర అధికారులు, ముఖ్యంగా ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న నేపథ్యంలో విద్యా వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, గత అనుభవంతో ఇది స్పష్టమైందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అందరూ ఒక టీమ్‌గా కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. లాభాపేక్ష లేకుండా పిల్లల భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమవుతుందనే నమ్మకం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గారు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ మాట్లాడుతూ రేపటి తరం బాగుకోసం పరితపించే ఇలాంటి నాయకుడు రాష్ట్రంలోనే కాదు దేశంలోనే లేరని, తల్లిదండ్రుల బాధ్యత ను తాను తీసుకుని అన్నీ తానై విద్యార్థుల భవిష్యత్తు కోసం తపిస్తున్న ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యా యజ్ఞ రూపశిల్పి అని ఆయన అన్నారు. వారితో కలిసి శత శాతం కార్యక్రమంలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నియోజకవర్గంలో విద్యావ్యవస్థను బాగు చేయడానికి తన భుజస్కంధాలపై వేసుకొన్నారని ఆయన చెప్పారు. అనంతరం శిక్షణ తరగతులను నిర్వహించిన రీసోర్స్ పర్సన్ లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ఎఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయ కర్త రవీందర్ రెడ్డి, పిఆర్టీయు అధ్యక్షులు మదన్మోహన్ యాదవ్, నాయకులు సుధాకర్ రెడ్డి, బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి ఘన సన్మానం

మహబూబ్ నగర్
ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 10
ప్రభుత్వ విప్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మహబూబ్ నగర్ నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న నేపథ్యంలో, వారి సేవలను గుర్తించిన ఆట (అమెరికా తెలుగు అసోసియేషన్) సంస్థ ప్రతిష్టాత్మకమైన 'కమ్యూనిటీ సర్వీస్ అవార్డు' ను అమెరికా వేదికగా ఆయనకు ప్రదానం చేసింది. ప్రజాసేవకు కట్టుబడి అహర్నిశలు పనిచేస్తూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఎమ్మెల్యే గారికి ఈ అవార్డు లభించడం ప్రత్యేకంగా నిలిచింది. అవార్డు అందుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన అనంతరం, మహబూబ్ నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.



సమాజ సేవలో ఎమ్మెల్యే చూపుతున్న నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న అంకితభావం, ముఖ్యంగా విద్యాభివృద్ధి కోసం ఆయన తీసుకుంటున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని నాయకులు కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వినోద్ కుమార్, ఎన్.పి. వెంకటేష్, కార్పొరేటర్లు తాహెర్, ప్రశాంత్, ఫక్రు, షబ్బీర్ అహ్మద్, ఎంపి ప్రవీణ్ కుమార్, రమేష్ రెడ్డి, యాదగిరి గౌడ్, మజ్జీద్, పాతూరి రమేష్, రాధ గోవర్ధన్, భాను చందర్, మోసిన్, నాయకులు మైత్రి యాదయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, టంకర కృష్ణయ్య యాదవ్, బొట్టు శ్రీను, చెన్నయ్య, జాజి మొగ్గ నర్సింహులు, రాషెద్ ఖాన్, ఏర్పుల నాగరాజు, వర్ధ రవి, తులసి రాం బండి మల్లేష్, అబ్దుల్ హక్, ఖాజా పాషా, తెలుగు గూడెం ఆంజనేయులు గండేటి నర్సింలు వేపూరు. దాసరి రఘు. పరమ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎంఏ రన్‌లో పాల్గొన్న గజ్వేల్ రన్నర్స్

## ఎస్ఎంఏ బాధితులకు అండగా 20 మంది పరుగులు

గజ్వేల్:10 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) బాధితులకు అండగా నిర్వహించిన ఎస్ఎంఏ రన్--2026లో గజ్వేల్ రన్నర్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు.




హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన హాఫ్ మారథాన్ రన్‌లో గజ్వేల్‌కు చెందిన 20 మంది రన్నర్స్ పాల్గొని తమ సత్తా చాటారు. ఈ సందర్భంగా గజ్వేల్ రన్నర్స్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి నిత్య వ్యాయామం ఎంతో అవసరమన్నారు. గజ్వేల్‌లో ఒకరిద్దరితో ప్రారంభమైన రన్నింగ్ ప్రస్తుతం 50 మందికి పైగా చేరడం సంతోషకరమని తెలిపారు. రన్నింగ్‌తో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నాగమునెయ్యతో పాటు గజ్వేల్ రన్నర్స్ జంగం రమేష్ గౌడ్,కాస జనార్దన్,కుర్రె మధుసూదన్ రెడ్డి, దుంబాల లింగారెడ్డి,ఏఈ సత్యం, దేవుని కిరణ్ కుమార్,గోవర్ధన్ రెడ్డి, తాళ్ల నరేష్ గౌడ్,వెంకటేశ్వర్ గౌడ్, కరుణాకర్,ఆప్కారి ప్రమీద్ గౌడ్, తలకొక్కుల రాజు,కాసర్ల కనకయ్య, అజయ్,అలిమెల ప్రభాకర్, కె.బాలు, అరిగే జయపాల్,తదితరులు పాల్గొన్నారు.

# గణిత పరిశోధనలో హరితకు డాక్టరేట్

## -గణిత పరిశోధనలో గీతం విద్యార్థినికి డాక్టరేట్..

పటాన్‌చేరు, ఆగస్టు 10 (ప్రజా కలం )ప్రతినిధి

గణితశాస్త్రంలో సంక్లిష్ట సమస్యల పరిష్కారానికి కీలకమైన స్థిర బిందు సిద్ధాంతంపై పరిశోధన చేసిన గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ పరిశోధక విద్యార్థిని దాదా హరిత పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించారు. సాధారణీకరించిన మెట్రిక్ ప్రదేశాలలో స్థిర బిందు సిద్ధాంతం,దాని అనువర్తనాలపై అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు గణితశాస్త్ర విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ కృష్ణ కుమ్మరి మార్గదర్శకత్వం వహించగా,డాక్టర్ కె. రామకోటేశ్వరరావు సహ–మార్గదర్శకులుగా వ్యవహరించారు. ఈ పరిశోధన స్థిర బిందు సిద్ధాంతానికి కొత్త సైద్ధాంతిక ఫలితాలను అందించడంతో పాటు, సాధారణీకరించిన మెట్రిక్ ప్రదేశాలపై భవిష్యత్ పరిశోధనలకు పటిష్టమైన పునాది వేస్తుందని వారు తెలిపారు. ఫలితాలు గణితశాస్త్రంతో పాటు విజ్ఞానశాస్త్రం, ఇంజినీరింగ్ రంగాల్లో పురోగతికి దోహదపడతాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిత పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. రెజా, గణిత, గణాంక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాదవ్ గణేష్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు..



# ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 10 (ప్రజా కలం)

ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ డివిజన్ 58లో గల పలు అమ్మవారి ఆలయాలను తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఆషాడ మాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ



సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణలోని ప్రతి కుటుంబంపై అమ్మవారి కృపా కటాక్షాలు ఉండాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నాయకులు గుమ్మలా రవీందర్ రెడ్డి, మట్ట సత్యనారాయణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ సామిడి చరణ్ రెడ్డి, మండల్ వైస్ ప్రెసిడెంట్ వరికుప్పల శివ, సార్ల రవి, దేరింగుల వంశీ, లక్ష్మాచారి, గడివేముల కృష్ణ, టిట్ల కృష్ణ, లోకేష్ మణి, చీమల్, చెర్రీ, వరుణ్, వివేక్, శివ తో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల వేడుకలు..

## -భక్తిశ్రద్ధలతో తొట్టెల ఊరేగింపు.. పాల్గొన్న ఆదిత్యరెడ్డి..

పటాన్‌చెరు,ఆగస్టు 10(ప్రజా కలం) ప్రతినిధి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల పండుగను పటాన్‌చెరులో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరులోని శ్రీరామ్‌నగర్ కాలనీ, కృషి రక్షణ కాలనీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాల వేడుకలు చేపట్టారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన తొట్టెల ఊరేగింపు



కార్యక్రమానికి తెలంగాణ యువజన ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాలనీవాసులతో కలిసి తొట్టెల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు ప్రజలకు, కాలనీవాసులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. భక్తుల నామస్మరణ, డప్పు చప్పుళ్ల మధ్య తొట్టెల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. కాలనీ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీంతో శ్రీరామ్‌నగర్, కృషి రక్షణ కాలనీల్లో పండుగ సందడి నెలకొంది..

# ఘనంగా రావిరాల పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు

### రావిరాల పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన

### కొంగర రావిరాల, జన్నాయిగూడ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ

### ప్రజల సహకారం అందరి సహకారంతో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం- అధ్యక్షులు ఆకుల రమేష్ ముదిరాజ్

### కార్యదర్శి పొలమోని ఆంజనేయులు ముదిరాజ్, గోనెమోని దేవేందర్ ముదిరాజ్

మహేశ్వరం, ఆగస్టు 10,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో ముదిరాజ్ కుల దైవమైన పెద్దమ్మ తల్లి బోనాలు ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఆదివారం నాడు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శి మాట్లాడుతూ ప్రజల సహకారం అందరి సహకారంతో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాం అన్నారు. ప్రతి సంవత్సరం మాదిగ ఈ సంవత్సరం ఇంకా అత్యంత వైభవంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించడం ప్రత్యేక పూజలు నిర్వహించడం భక్తులు కోరిన కోరికలు నెరవేర్చే పెద్దమ్మతల్లి భక్తుల అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఏ విధంగా రాజకీయ నాయకులు ప్రముఖులు గ్రామ ప్రజలు ముదిరాజ్ సంఘం నాయకులు ప్రత్యేకంగా దర్శించుకున్నారు.



కొంగర రావిరాల, జన్నాయిగూడ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

అద్యక్షులు ఆకుల రమేష్ ముదిరాజ్

ఉపాధ్యక్షులు

సొప్పరి దర్శన్ ముదిరాజ్, పిట్టల శ్రీశైలం ముదిరాజ్ సప్పిడి శ్రీరాములు ముదిరాజ్, గోదాసు నర్సింహ్మ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి మీగడ రాజ్ కుమార్ ముదిరాజ్, కార్యదర్శి పొలమోని ఆంజనేయులు ముదిరాజ్, గోనెమోని దేవేందర్ ముదిరాజ్ పిట్టల రాజు ముదిరాజ్ కోశాధికారి గద్దగూటి వెంకటేష్ ముదిరాజ్,ఉప కోశాధికారి సప్పిడి శ్రీనివాస్ ముదిరాజ్,కందిరీగల సుధాకర్ ముదిరాజ్ కార్యవర్గ సభ్యులు రాగనమోనిప్రబాకర్ ముదిరాజ్,పిట్టల శేఖర్ ముదిరాజ్,గోనమోని రవిందర్, గోదాసు అరుణ్ ముదిరాజ్,పిట్టల శివశంకర్ ముదిరాజ్,గోదాసు రాజు ముదిరాజ్,పిట్టల రవి యాదయ్య గోదాసు ప్రసాద్ ముదిరాజ్,లింగం తిరుమలేష్ ముదిరాజ్

ముఖ్య సలహా దారులు

లింగం నర్సింహ్మ ముదిరాజ్,గోనెమోని బాల్ రాజా ముదిరాజ్, రాగనమోని మహేందర్, కాగు హరిరాజు ముదిరాజ్, సొప్పరి యాదయ్య ముదిరాజ్ తలారి శ్రీనివాస్ ముదిరాజ్,నప్పిడి బిక్షపతి ముదిరాజ్,మీగడ కృష్ణ ముదిరాజ్,పొలమోని శంకరయ్య ముదిరాజ్, కందిరీగల చిన్న యాదయ్య ముదిరాజ్,లింగం సురేష్ ముదిరాజ్ గోనమోని యాదయ్య ముదిరాజ్ గోనమోని కుమార్ ముదిరాజ్, బుట్టి జంగయ్య ముదిరాజ్,పిట్టల బాబులు ముదిరాజ్, రాగనమోని మల్లేష్ ముదిరాజ్ రాగనమోని వెంకటేష్ ముదిరాజ్,నప్పిడి సుదర్శన్ ముదిరాజ్,పిట్టల జంగయ్య ముదిరాజ్, గోనమోని అశోక్ ముదిరాజ్,గోనమోని జనార్ధన్ ముదిరాజ్

సామ సత్తయ్య ముదిరాజ్, కాగు నర్సింహ్మ ముదిరాజ్, పొలమోని ప్రభాకర్ ముదిరాజ్ మీగడ శ్రీనివాస్ ముదిరాజ్, లింగం శ్రీనివాస్ ముదిరాజ్, లింగం కృష్ణ ముదిరాజ్, పొలమోని మహేందర్ ముదిరాజ్లింగం విజయ్ కృష్ణ ముదిరాజ్ గోదాసు ఇబ్రాహీం ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నకు కేంద్రం అండ.. చేనేతకు కొత్త ఊపిరి

## -అగ్గిపెట్టెలో ఇమిడే చీరల తయారీ నైపుణ్యానికి గుర్తింపు: ఎంపీ రఘునందన్‌రావు



గజ్వేల్:09 ఆగస్టు ( ప్రజా కలం ప్రతినిధి)

చేనేత కార్మికుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. అరుదైన నైపుణ్యంతో అగ్గిపెట్టెలో ఇమిడే చీరలను తయారు చేస్తున్న నేత కార్మికుల ప్రతిభను గుర్తించి,వారికి తగిన ప్రోత్సాహం అందించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పద్మశాలి సంఘం భవనం వద్ద రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న వంటశాల నిర్మాణానికి ఆదివారం ఎంపీ రఘునందన్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు,చేనేత కార్మికులు దేశానికి వెన్నెముక లాంటి వారని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న చేనేత కళను కాపాడటంతో పాటు నేతన్నల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. చేనేత కార్మికులకు రాయితీపై రుణాలు అందించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం కృషి చేస్తోందని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ చేనేత కార్మికులు తయారు చేస్తున్న అగ్గిపెట్టెలో ఇమిడే చీరలు వంటి అరుదైన కళాత్మక ఉత్పత్తులు వారి నైపుణ్యానికి నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. చేనేత రంగాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి నేతన్నలకు మెరుగైన ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కేంద్ర పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్,మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు దేవదాస్,చేనేత సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం,పద్మశాలి సంఘం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు నియోజకవర్గంలో బోనాల సందడి..

## -పటాన్‌చెరు నుంచి రామచంద్రాపురం, భానూరు వరకు..

## బోనాల వేడుకల్లో బీఆర్ఎస్ నేతల సందడి..

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ప్రజా కలం) ప్రతినిధి

ఆషాఢ మాస బోనాల సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలు వెల్లువెత్తాయి రామచంద్రాపురం, పటాన్‌చెరు,భానూరు,జేపీ కాలనీ, ఆల్విన్ కాలనీ,నందన్ ప్రైడ్ కాలనీల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుల మోత, పోతరాజుల సందడి, మహిళల బోనాల ఊరేగింపులతో ఆయా ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. రామచంద్రాపురం, పటాన్‌చెరు పట్టణం జేపీ కాలనీ, ఆల్విన్ కాలనీ, నందన్ ప్రైడ్ కాలనీల్లో జరిగిన వేడుకల్లో మాద్రి పృథ్వీరాజ్



పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి రాయసముద్రం చెరువు కట్ట సమీపంలోని పోచమ్మ దేవాలయం, బీహెచ్ఈఎల్ పెద్దమ్మ దేవాలయం, ఓల్డ్ ఎం.ఐ.జి. రేణుక ఎల్లమ్మ దేవాలయం,మయూరి నగర్, కానుకుంట,ఓల్డ్ రామచంద్రాపురంలోని అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, బీఆర్ఎస్వీ మాజీ జిల్లా కోఆర్డినేటర్ చిన్నా, నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భానూరు గ్రామంలో జరిగిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని గ్రామదేవతల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలంతా ఐక్యంగా పండుగను జరుపుకోవడం అభినందనీయమన్నారు. భానూరు వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్, రవీందర్ రెడ్డి, నరేందర్, సాగర్, శివయ్యతో పాటు నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు..



# గజ్వేల్‌లో ఘనంగా శాకాంబరీ ఉత్సవాలు

### ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

### కూరగాయల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

గజ్వేల్:10 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శాకాంబరీ ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వాసవీ మాతను వివిధ రకాల రంగురంగుల తాజా కూరగాయలు, ఆకుకూరలతో అత్యంత సుందరంగా అలంకరించారు. శాకాంబరీ దేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గోపూజ,సామూహిక కుంకుమార్చన,అమ్మవారి పారాయణం తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాచారం





దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్,కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు సిద్ది బిక్షపతి, సీనియర్ నాయకుడు నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి కృప ఉంటే ప్రజలందరికీ మేలు జరుగుతుందని అన్నారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించినట్లు తెలిపారు. శాకాంబరీ మాతగా పూజలందుకున్న వాసవీ మాత కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని,సకాలంలో వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్తెల్లి లక్ష్మయ్య,మల్యాల భద్రయ్య,కైలాస ప్రభాకర్,తోట బిక్షపతి,గంగిశెట్టి ఉమేష్, కైలాస ప్రశాంత్,సిరిపురం సత్యనారాయణ,సంతోష్, కాశీనాథ్, శ్రీకాంత్,లక్ష్మీ నరసయ్య,యాదగిరి,ఆర్యవైశ్య మహిళలు,ఆర్యవైశ్య సంఘం నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు ఇవ్వకుంటే చీపుర్లతో సచివాలయాన్ని ముట్టడిస్తాం

## స్వీపర్లకు ఆరు నెలలుగా వేతనాల్లేవు.. ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్:10ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పనిచేస్తున్న స్వీపర్లకు గత ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తీవ్రంగా స్పందించారు.బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ భారతీయ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో స్వీపర్లు ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ



సందర్భంగా బీఎంఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మరాటి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు అందక స్వీపర్లు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీకి వివరించారు.వెంటనే బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.స్వీపర్ల సమస్యపై స్పందించిన ఎంపీ రఘునందన్‌రావు కార్మికులకు అండగా ఉంటానని, జీతాలు చెల్లించకపోతే స్వీపర్లతో కలిసి చీపుర్లు చేతబట్టి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించినట్లు బీఎంఎస్ నాయకులు తెలిపారు. మార్కెట్ చైర్మన్లను నియమించడం,రాజకీయాలు చేయడం కంటే ముందుగా నెలల తరబడి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్న స్వీపర్లకు వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.స్వీపర్ల సమస్యను వెంటనే పరిష్కరించి బకాయి వేతనాలు చెల్లించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్‌రావు, జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, మార్కెట్ స్వీపర్ల సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## ఏఐసీసీ-విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి.

మహేశ్వరం, ఆగస్టు 10 ప్రజా కలం:

బోనాల పండుగ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని వినాయక హిల్స్ కాలనీ తిరుమల నగర్ కాలనీలలోని శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి




ఆలయాలను ఏఐసీసీ-విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి సందర్శించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లి అనుగ్రహం ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ ఆలయ దర్శన కార్యక్రమంలో నాదర్‌గుల్ డివిజన్ - 57 అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, రవికాంత్ రెడ్డి, లాల్ సింగ్ నాయక్, దిండు శ్రీనివాస్ గౌడ్, రోహిత్ రెడ్డి, దన్ సింగ్ నాయక్, చౌహాన్ నాయక్, రమేష్ గౌడ్, రవీంద్ర నాయక్, వినోద్ నాయక్, నరసింహ గౌడ్, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు.

# మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని కలిసిన సీపీఐ నాయకులు

గజ్వేల్: 10 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిని సీపీఐ పార్టీ నాయకులు కలిసి పలు సమస్యలపై చర్చించారు.సీపీఐ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు బట్టు దయానంద్ రెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు,గజ్వేల్ చేనేత సహకార కార్మిక సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, సీపీఐ నాయకులు సర్గం రాములు తదితరులు నర్సారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు.ముఖ్యంగా నిరుపేద చేనేత కార్మికుల సమస్యలు,చేనేత కార్మిక సంఘం అభివృద్ధి, గజ్వేల్‌లో పెండింగ్‌లో ఉన్న రింగ్ రోడ్డు, బస్టాండ్ నిర్మాణ పనులు, నియోజకవర్గంలోని ప్రాజెక్టులు, కెనాల్ కాలువలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.సీపీఐ నాయకులు ప్రస్తావించిన సమస్యలపై మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆయా సమస్యలను వీలైనంత త్వరగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, ఆగస్టు 10, ప్రజా కలం:

కాలనీల అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నప్పటికీ, కాలనీ సంక్షేమ సంఘాలు ముందుకు వచ్చి అభివృద్ధి పనుల్లో అధికారులకు సూచనలు ఇచ్చి, కాలనీలకు కావాల్సిన సదుపాయాలను దగ్గరుండి పర్యవేక్షిస్తే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉండవని, మన్నికగా ఉంటాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు.ఆర్.కే.పురం డివిజన్ పరిధిలోని అల్కాపురి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు కోరినట్లు తెలిపారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, నెల రోజుల్లోనే పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. అల్కాపురి కమిటీ హాల్‌కు ఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏసీ ఉంటే చిన్న చిన్న ఫంక్షన్లు కూడా నిర్వహించుకోవచ్చుని, దానివల్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థి కంగా బలపడుతుం దని అన్నారు. ఆర్.కే.పురం డివిజన్‌లో ఉన్న దేవాలయాలు మరెక్కడా లేవని, అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిం చారు. ఈ ప్రాంతంతో తనకు గత 12 సంవత్సరాలుగా అనుబంధం ఉందని, తాను అధికారంలో లేకున్నా ఆదరిం చారని గుర్తు చేసుకున్నారు. ఏ సమస్య ఉన్నా తనను సంప్రదిస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన అల్కాపురి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, సెక్రటరీ కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరేందర్, జాయింట్ సెక్రటరీ సైదారావు, ట్రెజరర్ కృష్ణయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెంద్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, సాజిద్, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో హైడ్రాకు మద్దతుగా సంఘీభావం

## ర్యాలీ నిర్వహించిన కాలనీ,గేటెడ్ కమ్యూనిటీ వాసులు..
## ముష్కిన్ చెరువును కాపాడిన హైడ్రా..
## వరదలకు చెక్ పెట్టాలంటే హైడ్రా తప్పనిసరి..




హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాకలం) : మహానగరంలో హైడ్రాకు ప్రజలు మద్దతు పలుకుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేట్టి ప్రభుత్వ భూములు,చెరువుల పరిరక్షణకు హైడ్రాలపేరుతో మాస్టర్ ప్లాన్ చేపట్టిన విషయం తెలిసిందే.కాగా హైడ్రా పురుడుపోసుకున్న రెండేళ్ల లో లక్షా 50 వేల కోట్ల రూప్షయల విలువైన భూమిని, వందల సంఖ్యలో చెరువులును కాపాడిన విషయం తెలిసిందే.ఒక వైపు హైడ్రా పై హైకోర్టులో కేసులు నమోదు కావడంతో చివాట్లు తప్పలేదు.దీనితో హైడ్రా కమిషనర్ ను తొలగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనితో స్థానిక ప్రజలు హైడ్రాకు మద్దతు తెలుపుతూ.. సంఘీంభావాన్ని ప్రకటిస్తున్నారు. ఇప్పటికే అమీర్ పేట, మధురానగర్ కాలనీలకు చెందిన నివాసితులు హైడ్రాకు అండగా నిలిచి ర్యాలీ చేపట్టారు.గచ్చిబౌలిలోని జనార్ధన హిల్స్ కాలనీలో ఆక్రమణలకు గురైన వరద కాలువను, దానికి ఆనుకుని ఉన్న పార్కును హైడ్రా పరిరక్షించిందని స్థానికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు, మహిళలు, చిన్నారులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి, హైడ్రాకు సంఘీభావం ప్రకటించారు. నగర భవిష్యత్తు బంగారంలా ఉండాలంటే హైడ్రా కచ్చితంగా ఉండాల్సిందేనని వారు స్పష్టం చేశారు. భవిష్యత్తులో వరదలు లేని సురక్షిత నగరంగా హైదరాబాద్ మారాలంటే చెరువులను కాపాడుకోవడం అత్యవసరమని వెల్లడించారు. నగరంలో చెరువులు, పార్కులు, నాలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు మద్దతుగా నగరవ్యాప్తంగా ర్యాలీలు, సంఘీభావ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతు న్నాయి. దేశంలోనే ప్రథమంగా హైడ్రా వంటి వ్యవస్థను తీసుకువచ్చి,నగర భవిష్యత్తు కోసం శ్రమిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి కాలనీ సంక్షేమ సంఘాలు, స్థానికులు పెద్దఎత్తున మద్దతు తెలుపుతున్నారు. హైడ్రాను కొనసాగించాలని ప్రజలు డిమాండ్ చేశారు.

# డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీలో ఘనంగా ఆషాఢ బోనాల పండుగ

గజ్వేల్:10 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీలో ఆషాఢ మాసం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోచమ్మ, బంగారు మైసమ్మ అమ్మవార్లకు మున్సిపల్ చైర్‌పర్సన్



గంగిశెట్టి చందన రవీందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒడిబియ్యం సమర్పించారు. డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీలో చైర్‌పర్సన్‌గా తొలిసారిగా అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల,మత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా,సోదరభావంతో బోనాల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవార్ల ఆశీస్సులు గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.పండుగను భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలు,మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.బోనాల పండుగతో డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీ అంతా భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణంతో సందడిగా మారింది.

# డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీలో ఘనంగా ఆషాఢ బోనాలు

గజ్వేల్: 10 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీలో ఆషాఢ మాసం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పోచమ్మ, బంగారు మైసమ్మ అమ్మవార్లకు మున్సిపల్ చైర్‌పర్సన్



గంగిశెట్టి చందన రవీందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒడిబియ్యం సమర్పించారు.చైర్‌పర్సన్‌గా డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీలో తొలిసారిగా అమ్మవార్లకు ఒడిబియ్యం సమర్పించిన సందర్భంగా చందన రవీందర్ మాట్లాడుతూ కుల,మత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా,సోదరభావంతో బోనాల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అమ్మవార్ల ఆశీస్సులు గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని,ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు,మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.బోనాల పండుగతో డబుల్ బెడ్‌రూమ్స్ కాలనీ భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది.



# ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహేశ్వరం బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్

మహేశ్వరం,ఆగస్టు 10 ప్రజా కలం

ఆషాడ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాదర్గుల్, బడంగ్‌పేట్, ప్రశాంతి హిల్స్, ఆర్కేపురం డివిజన్లలోని పలు అమ్మవారి ఆలయాలను మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ దర్శించుకున్నారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ, “ఆషాడ మాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. తెలంగాణలోని ప్రతి కుటుంబంపై జగజ్జనని అమ్మవారి కృపా కటాక్షాలు ఉండాలని ప్రార్థిస్తున్నాను” అని అన్నారు.
అనంతరం బడంగ్‌పేట్ గ్రామంలో టీం మహాకల్ ఆధ్వర్యంలో



నిర్వహించబోతున్న మహా తొట్టెల ఊరేగింపు లో భాగంగా తొట్టెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక బీజేపీ నాయకులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, భక్తులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా బోనాలు వేడుకలు..

**ఊపిరిపూల్చుకున్న పోలీసులు...**

**అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన సీపీ సజ్జనార్..**

**అక్కన్న మాదన్న ఆలయం ఉరేగింపు**

**ప్రారంభించిన పోలీసు కమిషనర్..**

సిటీ బ్యూరో:ఆగష్టు10:ప్రజాకలం ప్రతినిధి

నగరంలో నెలరోజుల పాటు సాగిన బోనాల ఉత్సవాలు ప్రశాంతగా ముగిననసినట్లు నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ తెలిపారు.అక్కన్న మాదన్న ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించి ఊరేగింపు వేడుకలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. విశిష్ట చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పూర్వకాలంలో ప్లేగు ప్రాణాంతక వ్యాధులు, వరదల నుంచి ప్రజలను కాపాడిన మహంకాళి అమ్మవారి దయ ఎల్లప్పుడూ నగర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.ఘటం ఊరేగింపు సాగే మార్గాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటులేకుండా విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వేడుకలు విజయవంతం చేసేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయం చేశామన్నారు.హరిబౌలిలోని అక్కన్న మాదన్న



ఆలయం నుండి ప్రారంభమైన ఈ ఊరేగింపు గౌలిపురా, లాల్ దర్వాజ, శాలిబండ మీదుగా సాగి నయాపూల్ వద్ద ముగుస్తుందని వివరించారు.హైదరాబాద్‌లోని చారిత్రాత్మక పాతబస్తీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా ముగిశాయన్నారు..అంతకుముందు ఆయన అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు సీపీ క్రైమ్స్ ఎం. శ్రీనివాస్, అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్, డీసీపీ టాస్క్ ఫోర్స్ వైభవ్ గైక్వాడ్, డీసీపీ చార్మినార్ జోన్ ఖారే కిరణ్ ప్రభాకర్, డీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆర్. వెంకటేశ్వర్లు, ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్, జనరల్ సెక్రెటరీ దత్తాత్రేయ, సలహాదారు రాజారత్నం, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల అస్తిత్వ పరిరక్షణ అందరి బాధ్యత

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్స వేడుకలు
## అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది-మంత్రి అడ్లూరి
## పలువురికి సత్కారం,ప్రసంసా పత్రాలు..

హైదరాబాద్, ఆగస్టు 10 (ప్రజాకలం) :

ఆదివాసీల అస్తిత్వ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కొమురం భీమ్ ఆదివాసీ




భవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సహకారం అదిస్తుందని స్పష్టం చేశారు. ప్రపంచంలో వేగంగా మార్పులు వస్తున్నా.. ఆదివాసీలకు మాత్రం ఆఫలాలు అందిడంలేదన్నారు. అభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేయాల్సిన బాధ్యత అందరి పై ఉందని గుర్తు చేశారు. అడవులను ఆవాసాలుగా చేసుకుని జీవించే వారికి విద్యా,వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. నగరాలకు దూరంగా జీవించే వారు ఆధునికం వైపు నడవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మరోవైపు పలువురు ఆదివాసీలకు ప్రసంసా పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ , తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బోనాల పండుగ



మెదక్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 10 రేగోడు మండల పరిధిలోని ఆర్ ఇటిక్యాల గ్రామంలో ఆదివారం గ్రామ ప్రజలు గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మహిళలు బోనాలు ఎత్తుకొని వెళ్లి దేవతలకు సమర్పించారు ఈ కార్యక్రమంలో మల్లేశం రమేష్ మల్లప్ప ఈశ్వరప్ప గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ఆషాఢ బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 10 ప్రజా కలం

ఆషాఢ బోనాల సందర్భంగా మహేశ్వరం పరిధిలోని పలు గ్రామదేవతల ఆలయాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాస బోనాల పండుగను పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్, నాదర్



గుల్, మీర్ పేట్ డివిజన్లలో వేంచేసియున్న పలు గ్రామదేవతల ఆలయాలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ నిలువెత్తు ప్రతీక అని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల దుష్టశక్తులు తొలగిపోయి, సకల జనులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు చేకూరుతాయని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా అందరిపై ఉండాలని ఆకాంక్షించినట్లు చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు, నిర్వాహకులు మెరుగైన ఏర్పాట్లు చేయడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలందరూ ఐకమత్యంతో, ఆధ్యాత్మిక శోభతో పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

# పేదలకు ఉచిత క్యాన్సర్ వైద్యం..

## తొలి దశలోనే గుర్తించడమే లక్ష్యం

## మెదక్ పార్లమెంట్ పరిధిలో ప్రతి పత్యేక వైద్య శిబిరాలు: ఎంపీ రఘునందన్‌రావు



గజ్వేల్:10 ఆగష్టు
( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నిరుపేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రత్యేక క్యాన్సర్ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. క్యాన్సర్ రోజురోజుకూ ప్రాణాంతక వ్యాధిగా మారి ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు.

ప్రతి ఉచిత క్యాన్సర్ పరీక్షలు

'సింధు ఆసుపత్రి' సౌజన్యంతో డాక్టర్ సింధు మాధవనేని, డాక్టర్ శ్రవణ్ తేజ ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రతి ఆదివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన వారికి పూర్తిగా ఉచితంగా చికిత్స అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.

ఆసుపత్రి సమస్యలు పరిష్కరిస్తా

గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న పలు సమస్యలను వైద్యులు తన దృష్టికి తీసుకువచ్చారని ఎంపీ తెలిపారు. ఆసుపత్రిలో తాగునీటి సౌకర్యం, పబ్లిక్ టాయిలెట్లు, చిన్నపిల్లల వార్డులో టైల్స్ మరమ్మతులు వంటి సమస్యలను ఎంపీ నిధులు ద్వారా త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

మూడు నెలలకోసారి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన జరగాల్సిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉండటం వల్ల ఆసుపత్రి సమస్యలపై తగినంత దృష్టి సారించలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. కనీసం మూడు నెలలకోసారి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి,ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరిస్తూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని సూచించారు.

# వ్యాపారులే టార్గెట్..

## అక్రమ వసూళ్ల ముఠా గుట్టురట్టు

- స్టోన్ క్రషర్ యజమాని వద్ద రూ.20 లక్షలు.. రైస్ మిల్లర్ వద్ద రూ.10 లక్షలు డిమాండ్.
- రూ.50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం -- నిందితులకు రిమాండ్.
- బెదిరింపులు, అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తప్పవు. - జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

వేములవాడ, ఆగస్టు 10 (ప్రజా కలం ప్రతినిధి) :

వ్యాపారులను బెదిరించి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను వేములవాడ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు,అరెస్టయిన వారు కొనరావుపేట మండలం ఏగలాస్పూర్ గ్రామానికి చెందిన వినోద్ (33), ప్రస్తుతం వేములవాడ సాయినగర్ నివాసి, అలాగే వేములవాడ నాంపల్లికి చెందిన అమరగొండ అజయ్ (27)గా పోలీసులు గుర్తించారు,దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, వేములవాడ మండలం అగ్రహారం శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురవయ్యను నిందితులు లక్ష్యంగా చేసుకున్నారు. ఈ నెల 9న ఫోన్ చేసి క్రషర్ లైసెన్స్, భూమికి సంబంధించిన అంశాలపై అసత్య ప్రచారం చేస్తామని బెదిరించి అగ్రహారం గుట్టల వద్దకు పిలిపించారు, వ్యాపారానికి ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు,భయపడిన బాధితుడు ఏటీఎం నుంచి రూ. 50 వేల నగదు తీసుకువచ్చి అగ్రహారం టీ పాయింట్ వద్ద నిందితులకు అందజేశాడు, అదే విధంగా వేములవాడకు చెందిన రైస్ మిల్లర్ బండ మల్లేశాన్ని కూడా బెదిరించి రూ. 10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు



చేసి, సాంకేతిక ఆధారాలతో నిందితులను సాయినగర్‌లో అదుపులోకి తీసుకున్నారు,వారి వద్ద నుంచి రూ. 50 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

బెదిరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం...

ఎవరైనా బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని లేదా 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగవద్దని, బెదిరింపులు, అక్రమ వసూళ్లు, అసత్య ప్రచారాల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తెలంగాణలో వేగంగా మౌలిక ఓటర్ల సర్వే

## వంద శాతం ఈఎఫ్‌ఎస్‌ల పంపిణీ
## డిజిటైజేషన్‌లో యాదాద్రి భువనగిరి అగ్రస్థానం
## హైదరాబాదు జిల్లాలో 58.58 శాతం

సిటీ బ్యూరో:ఆగష్టు 10 ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న మౌలిక ఓటర్ల




సర్వే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని అధికారులు తెలిపారు. ఆగస్టు 9 సాయంత్రం 6 గంటల వరకు అందిన తాజా నివేదిక ను అధికారులు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 3,38,26,448 మంది ఓటర్లకు 100 శాతం ఎలక్టోరల్ ఫారమ్‌ల (EFs) పంపిణీ విజయవంతంగా పూర్తయిందని స్పష్టం చేశారు. కాగా పంపిణీ చేసిన ఫారమ్‌లలో ఇప్పటివరకు 2,64,30,494 ఈఎఫ్‌ఎస్‌ల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయి చేశామని తెలిపారు. రాష్ట్ర సగటున 78.14 శాతం నమోదైంది.

జిల్లాల వారీగా పరిశీలిస్తే, డిజిటైజేషన్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా 94.30 శాతంతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవగా, జనగామ (91.69%), మెదక్ (90.54%), సూర్యాపేట (90.43%) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. మహబూబాబాద్,కొమురం భీమ్ ఆసిఫాబాద్, నల్గొండ జిల్లాల్లో దాదాపు 90 శాతం వరకు పూర్తి చేసి పురోగతిలో ఉన్నాయన్నారు.

కాగా, హైదరాబాదు జిల్లాలో 58.58 శాతం, మేడ్చల్ మల్కాజిగిరిలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతంతో డిజిటైజేషన్ పూర్తి చేసి చివరి స్థానాల్లో కొనసాగుతున్నాయి. మిగిలిన జిల్లాల్లో సైతం ఓటర్ల సమాచార డిజిటైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోందని వివరాలు అందించారు..



# భక్తి పారాయణంతో మార్మోగిన మహంకాళి అమ్మవారి ఆలయం

## -150 మంది వైశ్య మహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు.

వేములవాడ, ఆగష్టు 10 (ప్రజా కలం ప్రతినిధి) :

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న బోనాల జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి విశేష అభిషేకాలు,పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వికాస తరంగిణి వైశ్య మహిళా బృందం ఆధ్వర్యంలో సుమారు 150 మంది మహిళలు భక్తి పారాయణం,ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తి గీతాలు, పారాయణాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బోనాల మహోత్సవాల సందర్భంగా వేములవాడతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులు చెల్లించుకుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు,ఆరాధనలు నిర్వహించడంతో భక్తుల్లో ఆధ్యాత్మిక భావం వెల్లివిరిసింది. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారు శాకాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ఆలయంలో అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు,భక్తులు,పుర ప్రముఖులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర ఆలయంలో ఈవో ఆకస్మిక తనిఖీ

## - భక్తుల సౌకర్యాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన.

వేములవాడ, ఆగస్టు 10 (ప్రజా కలం ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి



ఆలయంలో దేవస్థాన ఈవో ఎల్. రమాదేవి సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు,ఆలయంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలు, వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు,ఈ సందర్భంగా కొబ్బరికాయలు కొట్టే ప్రాంతాన్ని భక్తుల మాదిరిగానే సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు,భక్తుల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నారా అనే అంశంపై ఆరా తీసి, భక్తులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దీపాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి భక్తులకు నాణ్యమైన దీపాలు అందుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించారు. విక్రయ కేంద్రాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు, వికలాంగులు, వృద్ధులు, చిన్నారులతో వచ్చిన కుటుంబాలు సులభంగా స్వామివారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించారు, దర్శన ఏర్పాట్లను తనిఖీ చేసి అవసరమైన మార్పులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆలయ పరిసరాలను పరిశీలించిన ఈవో రమాదేవి, భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆలయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీలో డీఈఓ నవీన్, డీఈ రామ్‌కిషన్‌రావు, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.





# బొమ్మలరామారం మండలంలో ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

బొమ్మలరామారం,ఆగస్టు 10 (ప్రజా కలం )

బొమ్మలరామారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం రోజున మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరించి ఘనంగా నిర్వహించినట్లు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామిడి శ్రవణ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ,ప్రజా సమస్యలపై పోరాడుతూ యువతను భాగస్వామ్యం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయడంలోనూ యూత్ కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.?ఈ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు,మండల పార్టీ అధ్యక్షులకు, ఆత్మ కమిటీ చైర్మన్ కి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కి,సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లకు,సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులకు, అలాగే మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు,మాజీ వార్డు సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ?అలాగే గ్రామాల నుంచి విచ్చేసిన యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,సోషల్ మీడియా మండల కమిటీ ప్రతినిధులు, వివిధ విభాగాల యూత్ కాంగ్రెస్ నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చీర సత్యనారాయణ,పిఎసిఎస్ చైర్మన్ సింగిర్తి మల్లేశం, భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేష్ పైలెట్, ఉపసర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు మైలారం సుదర్శన్, రాష్ట్ర ఆదివాసి సెక్రెటరీ రాజు నాయక్,మర్రి భగవంతు రెడ్డి, శ్రీరాములు నాయక్, ఫకీర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎర్వ హేమంత్ రెడ్డి, ప్రేమ్ రెడ్డి, సాయికుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జివిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో సరికొత్త ప్రపంచ రికార్డు

## -కేవలం 3 నిమిషాల 6 సెకన్లలో 80 షాబాద్ టైల్స్‌ను 9 కరాటే టెక్నిక్స్‌తో బ్రేక్ చేసిన పోలీస్ కానిస్టేబుల్ వి. సుధాకర్



హైద్రాబాద్ ఆగస్టు 10 (ప్రజాకలం న్యూస్)

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం డాక్టర్ జిఎస్ మేల్కోటిపార్క్ లో జరిగిన ప్రపంచ రికార్డు జివిఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన "మిషన్-80" ప్రపంచ రికార్డు ప్రయత్నం విజయవంతంగా పూర్తైంది.జివిఆర్ కరాటే అకాడమీకి చెందిన జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడు, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ వి.సుధాకర్ తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ 80 షాబాద్ టైల్స్‌ను 9 విభిన్న కరాటే బాడీ టెక్నిక్స్‌తో కేవలం 3 నిమిషాల 6 సెకన్లలో బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పారు.ఈ ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో నిర్వహించారు. రికార్డు ప్రయత్నాన్ని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ అధికారికంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం రికార్డు విజయవంతంగా పూర్తైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రమన్ గౌడ్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా "మిషన్-80"ను నిర్వహించడం ద్వారా యువతకు క్రమశిక్షణ, పట్టుదల, శారీరక దృఢత్వం దేశభక్తి సందేశాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రపంచ రికార్డు ద్వారా యువత క్రీడల వైపు అడుగులు వేస్తూ, మాదకద్రవ్యాలు ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని

వి.సుధాకర్ కఠోర సాధనతో ఈ ప్రపంచ రికార్డును విజయవంతంగా పూర్తి చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రమన్ గౌడ్,జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి, అకాడమీ బ్లాక్ బెల్ట్స్ నర్సింగరావు, కరీం,అమృతరెడ్డి, గణ సంతోషిని రెడ్డి,రాజు,అవిఘ్న వెంకటరెడ్డి, మేల్కోటిపార్క్ అధ్యక్షుడు బుషన్ రావు,భరత్వాజ్, అభిషేక్ రెడ్డి, జెష్వాల్,జెక్కీ హానన్ ఆర్యన్ కిషన్,రఘు, నర్సింగ్ క్రికెట్ కోచ్ లు,విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయాలను సందర్శించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

మేడిపల్లి ఆగస్టు 9(ప్రజాకలం న్యూస్)

పీర్జాదిగూడ బోనాల పండుగ సందర్భంగా నగర పరిధిలోని శ్రీ బంగారు మైసమ్మ, శ్రీ పోచమ్మ అమ్మవారి ఆలయాలను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని, అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

# మల్కాజిగిరి లో పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

మల్కాజిగిరి, ఆగస్టు 10(ప్రజాకాలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆదివారం తార్నాక, లాలపేట,మల్కాజిగిరి ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఉ



త్సవాల్లో భాగంగా తార్నాకలోని నల్ల పోచమ్మ ఆలయం, లాలాపేట్‌లోని పోచమ్మ ఆలయం, మల్కాజిగిరిలోని శ్రీ ఉజ్జయిని మహాంకాళి ఆలయం, సఫిల్‌గూడలోని శ్రీ కట్ట మైసమ్మ ఆలయాలను రాంచందర్ రావు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల పర్వదినం సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని రాంచందర్ రావు అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా ప్రజలందరికీ హృదయపూర్వక ఆషాడ మాస బోనాల శుభాకాంక్షలు తెలియజేస్తూ,అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలు, సమృద్ధితో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# మహిళలకు ఉచిత బస్సు ఉందా లేదా...?

## ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం అధికారుల నిర్లక్ష్యమా ప్రభుత్వం నిర్లక్ష్యమా...?

## ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎక్కడ ప్రశ్నిస్తున్న ప్రయాణికులు

మెదక్ ఆగస్టు 10 (ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా అల్లాదుర్గం నేషనల్ హైవే బ్రిడ్జ్ లపై బస్సులు స్టాప్ చేయకుండా వెళ్తున్నప్పటికీ ప్రయాణికులు ఇబ్బంది పడుతుంటే ఆర్టీసీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటున్న ప్రయాణికులు. తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ఏర్పాటు చేసిన తర్వాత మహిళ ప్రయాణికుల ఆర్టీసీ బస్సులో తిరగడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు, వివిధ పనుల నిమిత్తం అల్లాదుర్గం ఐబి చౌరస్తా నుండి వివిధ మండలాల నుండి నిత్యం వందలాది మంది ప్రయాణికులు వెళ్తుంటారు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో హైదరాబాద్ 1 హైదరాబాద్ 2 యాదగిరిగుట్ట, బాన్సువాడ డిపోలో కు చెందిన ఆర్టీసీ బస్సులు అల్లాదుర్గం సర్వీస్ రోడ్డు నుండి వెళ్లకుండా ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై నుండి బస్సులు వెళ్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులు నడుపుతుండడంతో ఈ పథకాన్ని మహిళలు ఉపయోగించుకుంటున్నారు. ఐబి చౌరస్తా నుండి వట్టిపల్లి, రేగోడ్ తో పాటు అల్లాదుర్గం మండలం నుండి ఆయా గ్రామాల ప్రజలు ఈ చౌరస్తా నుండి ప్రయాణిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఐబి చౌరస్తాలో బస్సులు ఫ్లైఓవర్ నుండి వెళ్తుండడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడవలసి వస్తుందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ హైదరాబాద్ టు డిపోలకు చెందిన బస్సులు ఫ్లైఓవర్ పై వెళ్తున్నాయని ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వివరణ కోరేందుకు ప్రయాణికులు ప్రయత్నించగా స్పందించకపోవడం గమన అర్థం. ఆర్టీసీ ఎండి ఆర్టీసీ చైర్మన్ స్పందించి ఫ్లైఓవర్ నుండి వెళ్లకుండా ఐబి చౌరస్తా సర్వీస్ రోడ్ల నుండి వెళ్లేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.








# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

## - జిల్లా రైతు సంఘం కమిటీ సభ్యులు ర్యాకల శ్రీశైలం



బొమ్మలరామారం, ఆగస్టు 10 (ప్రజా కలం)

నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని యాదాద్రి భువనగిరి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యాకల శ్రీశైలం అన్నారు సోమవారం రోజున బొమ్మలరామారం మండల కేంద్రం గుడి బావి చౌరస్తాలో దేశవ్యాప్తంగా జైల్ బరో కార్యక్రమం సందర్భంగా సిఐటియు,రైతు,వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ర్యాకల శ్రీశైలం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలుకు ఫైనల్ రూల్స్‌ను నోటిఫై చేయడం,విద్యుత్ సవరణ బిల్లు--2025,విత్తన చట్టానికి సవరణలు వంటి చర్యలకు తీసుకోవడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలంగా విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు. కార్మికుల శ్రమను మరింతగా దోచుకునేందుకు పని దినాలను పెంచుతూ,రోజువారీ పని సమయాన్ని 8 గంటల నుంచి 12 గంటల వరకు పెంచుకునే విధంగా యజమాన్యాలకు స్వేచ్ఛ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న 8 గంటల పని,సమ్మె హక్కు, కార్మిక సంఘాల హక్కులు, ఉద్యోగ భద్రత వంటి హక్కులను లేబర్ కోడ్స్ ద్వారా కాలరాస్తున్నారని అన్నారు. కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్‌పై కఠిన ఆంక్షలు విధించడం ద్వారా కార్మికుల సంఘటిత పోరాటాలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ అమలైతే తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కార్మికవర్గం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, పీఎఫ్,ఈఎస్ఐ,వెల్ఫేర్ బోర్డులపై కోతలు,ఆంక్షలు విధిస్తోందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు అంగన్వాడీ,ఆశా,మధ్యాహ్న భోజన పథకం,ఐకేపీ, వీఏఓలు,ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్య శాఖలోని వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో ప్రజలు ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నారని, అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కఠిన నిర్ణయాల వల్ల ఉపాధి హామీ పథకం నీరుగారిపోతోందని అన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి,గ్రామీణ పేదలకు సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా రైతులు,కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.రైతులకు పంటలకు గిట్టుబాటు ధర,వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధానాలను విడనాడి రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల హక్కులను కాపాడే విధానాలను పాలకులు అవలంబించాలని కోరారు. ప్రజా వ్యతిరేక,కార్మిక,రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి అధ్యక్షులు కరుణ, ప్రేమల గ్రామపంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజనం కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# మల్కాజిగిరి అమ్మవారి ఆలయాలలో మైనంపల్లి ప్రత్యేక పూజలు

మల్కాజిగిరి,ఆగస్టు 10 (ప్రజా కలం ప్రతినిధి)

ఆషాడ మాస బోనాల సందర్భంగా మల్కాజిగిరిలోని వివిధ అమ్మవారి ఆలయాలలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో ప్రాచీనమైన మల్కాజిగిరి శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు



నిర్వహించారు. మైనంపల్లి హనుమంతరావు కు ఆలయ కమిటీ వారు సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారిని మల్కాజిగిరి ప్రాంత ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ కూడా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు, బోనాల పండుగను శాంతియుత గా జరుపుకోవాలని పండుగ శుభాకాంక్షలు అందరికీ ఈ సందర్భంగా హనుమంతరావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్,బీకే శ్రీను, డివిజన్ ప్రెసిడెంట్ జీడి సంపత్ గౌడ్,వినోద్ యాదవ్,పిట్టల నాగరాజు,వైనాల ప్రవీణ్, రాందాస్ సంతోష్ ముదిరాజ్,కపిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడి చరణ్ జిత్ గౌడ్,బాబు సత్యనారాయణ,మోహన్ రాజ్,బాల రాజ్, యాదవ్,సురేష్ సింగ్, పార్థసారధి, నరేష్,నరేందర్ గౌడ్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ ఆనంద్ గౌలికర్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నివాళి

మల్కాజిగిరి, ఆగస్టు 10 (ప్రజా కలం ప్రతినిధి)

బీజేపీ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ ఆనంద్ గౌలికర్ పార్థివదేహానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నివాళులర్పించారు. మల్కాజిగిరిలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఆనంద్ గౌలికర్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆనంద్ గౌలికర్ పార్టీకి, ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన మృతి పార్టీకి, స్థానిక ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఆనంద్ గౌలికర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. తీరని విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని, మనోస్థైర్యాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, మల్కాజిగిరికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆనంద్ గౌలికర్‌కు ఘనంగా నివాళులర్పించారు.



# కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటమే ఆయుధం-117 మందికి శాశ్వత ఉద్యోగాలు..

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ప్రజా కలం) ప్రతినిధి : కార్మికుల హక్కులు,ఉద్యోగ భద్రత,మెరుగైన వేతనాల కోసం ఐక్య పోరాటమే మార్గమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, కిర్బీ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. కిర్బీ పరిశ్రమలో చారిత్రాత్మక వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా రామచంద్రాపురం ఎల్ఐజీ భారత్ ఫంక్షన్ హాల్‌లో కార్మికుల అభినందన సభ నిర్వహించారు. ఎల్ఐజీ చౌరస్తా నుంచి ఫంక్షన్ హాల్ వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. చుక్క రాములు మాట్లాడుతూ, తాజా ఒప్పందంతో 117 మంది కార్మికులు శాశ్వత ఉద్యోగాలు పొందుతున్నారని, ఇప్పటివరకు కిర్బీలో 235 మందిని శాశ్వత ఉద్యోగులుగా మార్చిన ఘనత సీఐటీయూదే అన్నారు. కేంద్ర కార్మిక




వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న జరిగే జైల్‌భరోలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. మల్లికార్జున్ మాట్లాడుతూ, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక నియమావళిని తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కే. రాజయ్య, కిర్బీ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు అతిమేల మాణిక్, ప్రధాన కార్యదర్శి వీఎస్. రాజు, అనంతరావు, ప్రదీప్, నరేష్, శాంత్‌కుమార్, సంతోష్‌గౌడ్, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, బాషా, రాజు, తలారి శ్రీనివాస్, నాగప్రసాద్, సుధాకర్, రాజిరెడ్డి, విఠల్, మల్లేష్, శ్యామ్, శంకర్, బిలాల్, మధు, పెద్దిరాజు, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు..



## లక్ష్మీనరసింహారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 10, ప్రజా కలం:

మహేశ్వరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనరసింహారెడ్డి తండ్రి ఇటీవల కన్నుమూయగా, వారి నివాసానికి మాజీ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్ రెడ్డి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా దివంగతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనితారెడ్డి, అనంతరం శోకంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె లక్ష్మీనరసింహారెడ్డితో మాట్లాడుతూ తండ్రిని కోల్పోవడం పూడ్చలేని లోటు. ఈ కష్ట సమయంలో మీ కుటుంబానికి మా మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని భరోసా ఇచ్చారు. దివంగతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఆదర్శ్ రెడ్డి బర్త్‌డే బిగ్ సెలబ్రేషన్..

### ఆదర్శ్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా..

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ప్రజా కలం) ప్రతినిధి

పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళా సంఘాల



నాయకులు, కాలనీ అధ్యక్షులు, డైరెక్టర్లు, యువ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. భారతి నగర్ డివిజన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఆదర్శ్ రెడ్డి దంపతులు కృషి చేస్తున్నారని నాయకులు కొనియాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ గ్రామంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఉద్యమకారుడు సంపత్ ఆధ్వర్యంలో ఆదర్శ్ రెడ్డి జన్మదినం సందర్భంగా జీహెచ్‌ఎంసీ కార్మికులకు సింధు ఆదర్శ్ రెడ్డి గొడుగులు పంపిణీ చేశారు. కార్మికుల సేవలను అభినందిస్తూ వారి సంక్షేమానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మహిళా సంఘాల నాయకులు, కాలనీ అధ్యక్షులు, డైరెక్టర్లు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి -డా కె నరేష్

### ఘనంగా సంఘమిత్ర కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు

కూకట్‌పల్లి, ఆగస్టు 10, ప్రజా కలం ప్రతినిధి:

కూకట్‌పల్లిలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ది అశోక గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కరెస్పాండెంట్ డా కె నరేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి



ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు తమ కళాశాల జీవితంలో మొదటి సంవత్సరం నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమ ఎంతో అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, కలలను సాకారం చేసే దిశగా విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె వి లావణ్య నరేష్, ప్రిన్సిపల్ ఎస్ఎన్ మీనాంబిక, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం, ప్రమాదాలు నివారిద్దాం ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

### ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో అరైవ్ అలైవ్, రోడ్డు భద్రతా అవగాహన సదస్సు

కంటోన్మెంట్:ఆగస్టు 10:ప్రజాకలం ప్రతినిధి

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తేనే ప్రమాదాలు నివారణ సాధ్యని ట్రాఫిక్ ఏసిపి జి. శంకర్ రాజు స్పష్టం చేశారు. తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్.కె. పురం ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం అరైవ్ అలైవ్ పేరుతో రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బందికి రోడ్డు భద్రతా నియమాల పై దిశానిర్దేశం చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ట్రాఫిక్ డిసిపి కె. రాహుల్ రెడ్డిల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టి అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని స్పష్టం చేశారు. ఇక ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలు పాటించడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ల వినియోగించ రాదని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు నడపారాదని, అతివేగాన్ని నియంత్రించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఆయన తెలిపారు.?ఈ కార్యక్రమంలో త్రిముల్ఘెర్రీ ట్రాఫిక్ సీఐ ఐ.వి. రమణయ్య, ఎస్ఐలు, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీమతి అర్చనా రాయ్, కౌన్సిలర్ డాక్టర్ సుధా మీనన్, ఉపాధ్యాయులు విద్యార్థు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు నియమాల ను పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ఈ మంచి కార్యక్రమాన్ని స్కూల్ యాజమాన్యం అభినందించారు

# విషం కలిపిన మద్యం తాగించి హత్య..

### ఆత్మహత్యగా చిత్రీకరించే కుట్ర భగ్నం

### - సిరిసిల్లలో సంచలనం.. ప్రధాన నిందితుడు అరెస్ట్.



సిరిసిల్ల, ఆగస్టు 10 (ప్రజా కలం ప్రతినిధి) :

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలకలం రేపిన వెంగల వెంకటేశం హత్య కేసును పోలీసులు ఛేదించారు, విషం కలిపిన మద్యం తాగించి హత్య చేసి, దానిని ఆత్మహత్యగా చిత్రీకరించి రాజకీయ ప్రత్యర్థులను ఇరికించే కుట్ర జరిగినట్లు పోలీసులు వెల్లడించారు, ఈ కేసులో ప్రధాన నిందితుడు కుసుమ గణేష్‌ను అరెస్ట్ చేసి, మరికొందరి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు, పోలీసుల కథనం ప్రకారం.. తారకరామానగర్‌కు చెందిన వెంగల వెంకటేశం (50) ఈ నెల 6వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయన భార్య సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా, ఈ నెల 8న రగుడు శివారులో వెంకటేశం మృతదేహం అనుమానాస్పద స్థితిలో లభ్యమైంది, దర్యాప్తులో భాగంగా పట్టణంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు, వెంకటేశంతో చివరిసారిగా కలిసి కనిపించిన కుసుమ గణేష్‌ను గుర్తించారు, అనంతరం ఎల్లమ్మ చౌరస్తా వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

**పని వివాదమే హత్యకు కారణం..**

మృతుడు వెంకటేశం తన వద్ద పనిచేస్తుండేవాడని, తరచూ పనికి గైర్హాజరవడం, మధ్యలోనే వెళ్లిపోవడం చేసేవాడని నిందితుడు విచారణలో తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు, ఉద్యోగం నుంచి తొలగిస్తానని చెప్పిన ప్రతిసారీ వెంకటేశం భార్య వచ్చి గొడవ చేయడంతో విసిగిపోయిన నిందితుడు అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.

**విషం కలిపిన విస్కీతో హత్య...**

డయ్యింగ్ పరిశ్రమలో ఉపయోగించే 'నైట్రాప్' అనే విషపదార్థాన్ని మద్యంలో కలిపితే మరణిస్తారని తెలిసిన నిందితుడు, ముందుగానే ఎంసీ విస్కీ క్వార్టర్‌లో విషం కలిపాడు. ఈ నెల 6న వెంకటేశాన్ని మద్యం తాగేందుకు రగుడు శివారుకు పిలిచి, విషం కలిపిన విస్కీ తాగించాడు, కొద్దిసేపటికే వెంకటేశం కుప్పకూలడంతో మృతి చెందినట్లు భావించి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు.

**రాజకీయ కుట్ర కోణం...**

ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారంలో నమోదైన కేసును ఆసరాగా చేసుకుని, వెంకటేశం మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరిస్తే ఆ కేసులో ఉన్న వ్యక్తిపై అనుమానాలు వెళ్లి రాజకీయంగా నష్టం జరుగుతుందని నిందితుడు భావించినట్లు పోలీసులు తెలిపారు, ఈ వ్యవహారంలో రాజకీయ కోణం ఉందా అనే దానిపై కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు, ఈ కేసులో లక్ష్మణ్, పోసు రమేష్, పసునూరి సూర్యప్రకాశ్‌తో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని వారి పాత్రపై విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు, అయితే వారి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతున్నందున పోలీసులు ఇంకా తుది నిర్ధారణ వెల్లడించలేదు, నిందితుడి వద్ద నుంచి మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు, నైట్రాప్ విషపదార్థం, ఎంసీ విస్కీ క్వార్టర్ బాటిల్, నిందితుడు ధరించిన దుస్తులు, క్యాప్, మృతుడి వద్ద లభించిన పేపర్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు..**

కేసును వేగంగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ నాగరాజు, క్రైమ్ పార్టీ హెడ్ కానిస్టేబుల్ పుల్కం శ్రీనివాస్, కానిస్టేబుళ్లు బి. రవికుమార్, ఎన్. శ్రీనివాస్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కదం తొక్కిన కమ్యూనిస్టులు

- క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలు.
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు మోకరిల్లుతున్న ప్రధాని మోదీ.
- నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలి.
- కనీసవేతనం రూ. 42వేలు అమలు చేయాలని డిమాండ్.
- విద్యుత్ చట్టం, వీబీజీరాంజీ చట్టాలు రద్దు చేయాలి.
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు.
- సంగారెడ్డి కొత్త బస్టాండు ముందు రాస్తారోకో.
- నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్కు తరలింపు.




సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 10( ప్రజా కలం):

దేశం కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతు, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంభించడంతో పాటు దేశాన్ని అమెరికా అధ్యక్షుడి ముందు మన ప్రధానమంత్రి నరేంద్రమోడీ మోకరిల్లుతున్నాడని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ఆరోపించారు. సోమవారం సంగారెడ్డిలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆద్వర్యంలో జైల్భరో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బీజేపీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా జైల్భరో కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతు సంఘాలు సంయుక్త కిషాన్మోర్చా డిల్లీలో రైతులకు వ్యతిరేకంగా మూడు చట్టాలు తీసుకువస్తే కరోనా కాలంలో సంవత్స రం పాటు డిల్లీ నగరాన్ని దిగ్బంధనం చేసి ప్రధాని నరేంద్రమోడితో క్షమాపణ చెప్పించుకుని మూడు చట్టాలను వెనక్కి తీసుకునేలా చేశారన్నారు. శ్రామికులు, శ్రమ చేసేవారు, అటు పొలాలలో గానీ, ఫ్యాక్టరీలలో గానీ, అటు అడ్డాల మీద గాని, కంపెనీలు, ఆఫీసులలో మానసిక శ్రమ చేసే ఉద్యోగులు, కార్మికులు ఎవరైనా సరే వీళ్లంరూ దేశ అభివృద్ధిలో భాగంగా పనిచేస్తున్నార న్నారు. శ్రమ చేసేవాళ్లే సంపద సృష్టిస్తున్నారన్నారు. ఈ వాళ మన దేశం అభివృద్ధి చెందుతుంది మూడో స్థాయిలో, నాలుగో స్థానం అని మన పాలకులు చెబుతున్నారన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే దానంతట అదే అభివృద్ధి చెందదని, వ్యవసాయరంగం ప్రధాన వనరు అన్నారు. ఇవాళ వ్యవసాయరంగం కుదించుకుపోతుందని, స్వేచ్ఛా వాణిజ్యాల ఒప్పందాల పేరుమీద విదేశాలతో మన భారత ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంటుందన్నారు. మన దగ్గర ముడి చమురు దొరకదు. అమెరికా వాడు తక్కువ ధరకు ఇచ్చే రష్యా వద్ద డీజిల్, పెట్రోల్ కొనవద్దని ఆంక్షలు పెడుతున్నాడన్నారు. ముడి చమురు కొనవద్దంటున్నాడు. ముడి చమురు కొంటే 50శాతం సుంకాలు వేస్తామని చెబుతున్నాడన్నారు. ఇప్పుడు 100శాతం సుంకాలు విధిస్తామని చెబుతున్నాని ఆరోపించారు.

**కార్పోరేట్ ప్రయోజనాలే ప్రధానికి ముఖ్యం..**

ఈ దేశానికి కార్పోరేట్ ప్రయోజనాలే ముఖ్యమని చుక్క రాములు ఆరోపించారు. ఆనాడు ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నాం..భారతదేశాన్ని ఇప్పుడు ఎవరు శాసిస్తున్నారంటే వెస్ట్ ఇండియా కంపెనీలు అని చెబుతున్నారన్నారు. వెస్ట్ అంటే గుజరాత్కు చెందిన ఆదానీ, అంబానీ లు ఈ దేశాన్ని ఏలుతున్నారని ఆరోపించారు. వీళ్లకు ఏది కావాలంటే అది మోడీ చేసి పెడుతున్నాడని, మన గనులు, మన బొగ్గు దోచిపెట్టడంతో పాటు బ్యాంకుల నుంచి కావలసిన రుణాలు అందిస్తున్నాడని ఆరోపించారు.

విద్యుత్ సవరణ బిల్లు తెచ్చి కరెంట్ వాడకానికి స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. విద్యా, వైద్యం ప్రైవేట్ వాళ్ల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. కనీసవేతనం రూ.42వేల వేతనం ఉంటేనే సరిపోతుందన్నారు. కానీ ఈ వాళ్ళ రూ.26వేలు కనీసవేతనం ఇవ్వాలని అడుగుతున్న దాని గురించి పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. దీనికి తోడు లేబర్ కోడ్లు తీసుకొచ్చారని, 8 గంటల పని చట్టబద్ధమైన పని కానీ లేబర్ కోడ్ 10 గంటల పని చేయించుకోవచ్చు. 12 గంటల పని విధానం ఉంటుదని చెబుతున్నారన్నారు. పిక్స్ టర్మ్.. సంవత్సరం, రెండు సంవత్సరాల పని అని ముందే చెబుతారని, కార్మికులు కట్టుబానిసలుగా మార్చుతున్నారని విమర్శించారు. అదే విధంగా మహాత్మాగాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామి పథకాన్ని మార్చి వీబీజీరాంజీ పేరుతో తీసుకువచ్చారని ఆరోపించారు. కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజలు కేంద్రం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.జయరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం. ఉపాధ్యక్షుడు బాగారెడ్డి, సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, వ్యకాస నాయకుడు అశోక్, వివిధ కంపెనీల యూనియన్ల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు టీఆర్టీయూ మద్దతు

### ఈనెల 12న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా
### ఆటో డ్రైవర్ల పొట్టకొడుతున్నప్రభుత్వం
### ప్రభుత్వ హామీలు నెరవేర్చాలని డిమాండ్
### పోస్టర్ ఆవిష్కరించిన టీఆర్ఎస్ నేతలు..
### మహాధర్నకు కల్వకుంట్ల కవిత..




హైదరాబాద్, ఆగస్టు 10:ప్రజాకలం ప్రతినిధి

లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ ఆటో డ్రైవర్ల జీవితాలను ఆగం చేస్తోందని టీఆర్ఎస్ నేత రూప్ సింగ్ విమర్శించారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఈ మహా ధర్నా పోస్టర్‌ను రూప్ సింగ్‌ఆ, ఇస్మాయిల్ ఆవిష్కరించారు. ఈ ధర్నాకు పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం కారణంగా ఇప్పటికే ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిన్నదని వివరించారు. మరోవైపు ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించడంలేదని ,దీనితో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయని తెలిపారు. .ఏ ఆటో యూనియన్, ఆటో డ్రైవర్ తో మాట్లాడకుండా లాస్ట్ మైల్ కనెక్టివిటీ కింద ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టాలని చూడటం సరికాదన్నారు..ఆటో డ్రైవర్ల ప్రయోజనాల కోసం కల్వకుంట్ల కవిత అండగా నిలుస్తుందని పేర్కొన్న వారు, వారి పక్షాణ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

**అధికారంలోకి హస్తం..ఆగమైన ఆటో డ్రైవర్ల జీవితం**

**మానసిక వేదనలో...**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నుండి ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని టీఆర్ఎస్ నేత ఇస్మాయిల్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఫ్రీ బస్సు పథకంతో ఆటో డ్రైవర్లకు ఆదాయం కరువైందని వెల్లడించారు.

దీనితో వారు మానసిక వేదనకు గరువతున్నారని స్పష్టం చేశారు. ఈ కారణంగా చాలామంది ఆటో డ్రైవర్లు ప్రాణాలు తీసుకు న్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం మరో సమస్యను తెరమీదికి తీసుకు రావడం బాధకరం అన్నారు. కొత్తగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో కార్మికుల పొట్టకొట్టే ఆనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఈ మహాధర్నాకు ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు, యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.


కూల్చిన ఫోటో

# నాడు అక్రమం-నేడు సక్రమమా?

- లక్షల్లో లంచాలు ఇస్తే అక్రమమైన సక్రమమే
- అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్న అక్రమ నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాల విషయంలో తమకేమి సంబంధం లేదంటున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది
-800 గజాలలో నిర్మిస్తున్న వాణిజ్య భారీ అక్రమ షెడ్డు
-ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి

కూకట్ పల్లి, ఆగస్టు 10, ప్రజా కలం ప్రతినిధి:

ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడిన తమ జేబులు రిండుతే చాలు అంటున్న కూకట్ పల్లి సర్కిల్ మున్సిపల్ అధికారులు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ కెపిహెచ్బి కాలనీ నాలుగో ఫేస్ లో 800 గజాలలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డును కాపాడే విషయంలో కమిషనర్ నుండి కిందిస్థాయి ఉద్యోగుల వరకు లక్షలు చేతులు మారినట్టు సమాచారం. పలు వార్తాపత్రికలలో కథనాలు రావడంతో తూతు మంత్రంగా చర్యలు తీసుకొని, మళ్లీ వారే ఈ అక్రమ నిర్మాణం ఎలా కొనసాగించాలని సూచనలు చేస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ఎవరైనా ఫిర్యాదు చేస్తే తమకేమీ సంబంధం లేదని తప్పించుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేస్తూ, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, లక్షలతో తమ జేబులు రింపిన వారికి వంత పాడుతూ అక్రమ నిర్మాణాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. నాడు అక్రమమని కూల్చిన వారే నేడు సక్రమం చేస్తున్నారు. నాడు అక్రమమని తెలిసి కూల్చారా? లేదా ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కూల్చారా అనేది లక్షల ప్రశ్నగా మారింది. అవినీతి అధికారులపై చర్యలు లేనంత కాలం ఇలాంటి అక్రమ కట్టడాలు కొనసాగుతూనే ఉంటాయి. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా, ఎన్ని ఫిర్యాదులు చేసినా అవి చెత్త కాగితాలకే పరిమితం అవుతాయనేది ప్రజల ప్రగాఢ విశ్వాసం.


ప్రస్తుత ఫోటో

# పీఎం ఏక్తా మాల్ టెండర్లలో భారీ కుంభకోణం?

- ప్రయివేట్ వ్యక్తులకు ప్రజా భూమి,కేంద్ర నిధులు
- సీఎం రేవంత్ రెడ్డి తీరు పై కేంద్రానికి కేటీఆర్ లేఖ
- కేంద్ర ఆర్థిక మత్రి నిర్మలా సీతారామన్ స్పందించాలి
- విమర్శలకే పరిమితమైన కేంద్ర మంత్రులు,రాష్ట్ర బీజేపీ నేతలు ..
- గతంలో బొగ్గు కుంభకోణం,అమృత్ టెండర్ల గోల్ మాల్..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్....

హైదరాబాద్, ఆగస్టు 10:ప్రజాకలం ప్రతినిధి

కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు పెరుగుతున్నాయని ప్రతిపక్ష పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో బొగ్గు కుంభకోణం,అమృత్ టెండర్ల గోల్ మాల్ బీఆర్ఎస్ పార్టీ బయటపెట్టిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు స్పష్టం చేశారు. తాజాగా రాయదుర్గ్‌లో రెండు వేల యాభై తొమ్మిది కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పీఎం ఏక్తా మాల్ ప్రాజెక్టు పై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ అరోపణల పై ఆయన సోమవారం కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్ కు లేఖ రాశారు.ప్రజా భూమిని,కేంద్ర నిధులను రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు డెవలపర్ కు దోచిపెడుతోందని లేఖలో పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా విలువైన ప్రజా భూమిని కెటాయించగా,కేంద్ర ప్రభుత్వం సుమారు రెండు వందల కోట్ల రూపాయల నిధులను ఇస్తోందన్నారు.పీఎం ఏక్తా మాల్ లో ప్రభుత్వానికి కనీసం తొమ్మిది లక్షల చదరపు అడుగులు మాత్రమే దక్కుతుండగా, ప్రైవేటు డెవలపర్‌కు మాత్రం రెట్టింపు.. పద్దెనిమిది లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కట్టబెడుతున్నారని వివరిచారు..



ప్రయివేట్ వ్యక్తులకు అనుకూలంగా టెండర్..

కేంద్రం వడ్డీ లేని రుణంగా సుమారు రెండు వందల కోట్ల రూపాయల ఎస్ఏఎస్‌సీఐ నిధులను ప్రైవేటు డెవల పర్‌కు బ్యాక్-టు-బ్యాక్ పద్ధతిలో మళ్లించేలా టెండర్ నిబంధనలు రూపొందించారని ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమృత్ టెండర్లు, బొగ్గు కుంభకోణాల పై ఆధారాలతో సహా కేంద్రానికి ఫిర్యాదు చేసినా పై కేంద్రం స్పందించడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రధాని, కేంద్ర మంత్రులు కేవలం విమర్శలు చేయడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తాజా పీఎం ఏక్తా మాల్ కుంభకోణంలోనైనా కేంద్రం స్పందించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థల చేతికి నిధులు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే ఈ టెండర్లను రద్దు చేసి విచారణ చేయాలని లేఖలో పేర్కొన్నారు.

# చీకటిలో ఆసుపత్రి..

## ప్రాణాలతో చెలగాటం..

-పటాన్‌చెరు ఆసుపత్రిలో కరెంట్ గోవిందా.!..
-టార్చ్ లైట్లే దిక్కు..మొబైల్ వెలుతురులో డాక్టర్ల చికిత్స..
-ఎమర్జెన్సీ కేసులకు గడ్డు పరిస్థితి..
- ఆసుపత్రి నిర్లక్ష్యానికి రోగుల ప్రాణాలు గాలిలో దీపం..
-ఎలక్ట్రీషియన్ మాయం..వైద్యశాఖ అధికారుల మౌనం..

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజారోగ్యంతో చెలగాటమా? ప్రభుత్వ ఆసుపత్రిలో కరెంట్ కష్టాలు - రోగుల ప్రాణాలతో నిర్లక్ష్యపు ఆట! మనిషి ప్రాణానికి విలువ లేదా? రోగుల క్షేమం కంటే అధికారుల నిర్లక్ష్యమే ఎక్కువా? అనే ప్రశ్నలు ఇప్పుడు పటాన్‌చెరు వాసుల నోళ్లలో మార్మోగుతున్నాయి. పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లాంటి అత్యంత కీలకమైన ప్రాంగణంలో కనీస విద్యుత్ సదుపాయం కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి,పాలనా వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

**ఉదయం నుంచి అంధకారంలో ఆసుపత్రి, టార్చ్ లైట్లే దిక్కు!..**

పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కరెంట్ లేకపోవడంతో వైద్య సిబ్బంది మొబైల్ ఫోన్ టార్చ్ లైట్ల వెలుతురులోనే రోగులకు చికిత్స అందించాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఆధునిక వైద్యం అందించాల్సిన ఆసుపత్రిలో ఇలాంటి దుస్థితి నెలకొనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

**చీకట్లో కొట్టుమిట్టాడుతున్న రోగులు..ఎవరు బాధ్యులు?..**

వార్డులన్నీ చీకటిమయంగా మారడంతో చికిత్స కోసం వచ్చిన రోగులు, వారి బంధువులు నరకయాతన అనుభవించారు. చీకట్లో మందులు ఇవ్వడం, ఇంజెక్షన్లు చేయడం వంటి పనులు వైద్య సిబ్బందికి ప్రాణసంకటంగా మారాయి. ముఖ్యంగా ఎమర్జెన్సీ కేసుల్లో, వెంటిలేటర్లు, మానిటర్ల వంటి పరికరాలపై ఆధారపడే రోగుల పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని సమాచారం.ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని భయానక వాతావరణం



ఆసుపత్రిలో నెలకొంది..

**గంటలు గడిచినా అందుబాటులో లేని ఎలక్ట్రీషియన్..**

విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన ఎలక్ట్రీషియన్ గంటల తరబడి అందుబాటులో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. ఇంత ప్రధానమైన ఆసుపత్రిలో అత్యవసర విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి కూడా సిబ్బంది లేకపోవడం ఏమిటని స్థానికులు నిలదీస్తున్నారు. బ్యాకప్ జనరేటర్ ఏర్పాటు ఎందుకు లేదని, ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు..

**అధికారుల మౌనం..మండిపడుతున్న స్థానికులు..**

ఈ ఘటనపై సాయంత్రం వరకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం మరింత ఆగ్రహావేశాలకు కారణమవుతోంది. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఇలాంటి తీవ్ర అంశంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది..

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా

- ఢిల్లీలో ధర్నా,బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
- ప్రెసిడెన్షియల్ ఆర్డర్ రద్దు చేయాలని డిమాండ్
- మతం మారినా క్రైస్తవులకు తప్పని...
- కాంగ్రెస్ పాలనలో పెరిగిన దాడులు.
- బీఆర్ఎస్ నేతల ఆర్ఎస్ ప్రవీణ్, ఎంపీ వద్ది రాజు..

హైదరాబాద్, ఆగస్టు 10:ప్రజాకలం ప్రతినిధి

రాజ్యాంగం అందించబడిన హక్కులను కాపాడుకోవడానికి దళిత క్రైస్తవులు దావీదు వలె పోరాటం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సోమవారం ఆల్ ఇండియా దళిత్ క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్ఫరెన్స్ కి బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, ఆర్టికల్ 15 , ఆర్టికల్ 25 ప్రకారం అందించబడిన హక్కులను కాపాడుకోవాలని సూచించారు.రంగనాథ్ మిశ్రా రిపోర్టు ఆధారంగా కేంద్రం నిర్ణయం తీసుకుని వారి హక్కలను కాపాడాల్సిన సమయం ఆన్నమైందన్నారు. సెక్యులర్ నాయకుడు కేసిఆర్ మద్దతుతో దళిత క్రైస్తవులు పోరాడాలని పిలుపునిచ్చారు. దళిత క్రైస్తవులకు బిఆర్ఎస్ ప్రభుత్వ సంపూర్ణ మద్దతు తెలిపి పోరాటానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వెంటిలేటర్ పై బీజేపీ ప్రభుత్వం....

బిజెపి ప్రభుత్వం పై తీవ్ర విమర్శలు చేశారు.బీజేపీ వెంటిలెటర్ పై ఉన్న ప్రభుత్వమని అభివర్ణించారు.కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు,బీహార్ ప్రభుత్వాలు నడిపిస్తున్నాయని ఎద్దేవ చేశారు. మరోవైపు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రద్దు చేయడం పై సీఎం చంద్రబాబు ప్రదాని మోడీతో మాట్లాడాలని సవాల్ విసిరారు..జవహర్ లాల్ నెహ్రూ ఎవరి ఆమోదం లేకుండానే, ఎలాంటి చర్చ లేకుండానే దొడ్డి దారిన,1950 పేరా 3 ఆధారంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ తెచ్చి దళిత క్రైస్తవులకు గుడిబండగా నిలిచారని వెల్లడించారు.ఎస్సీ హోదా వర్తించాలంటే హిందూ, బౌద్ధం, సిక్కు మతంలోనే ఉండాలంటూ అర్డర్ అమలులోకి తెచ్చారని, అది



రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 , 25 కు విరుద్దమన్నారు. దళితులు క్రిస్టియన్ , ఇస్లాం మతంలోకి మారినంత మాత్రాన వివక్ష పోలేదని ఈ సందర్భంగా ఆర్ఎస్పీ గుర్తు చేశారు.గతంలో కారంచెడు, చుండూరు, కదిరి కుప్పంలో వివక్షతోనే దాడులు జరిగాయన్నారు. ఇటీవల తెలంగాణలో జన్వాడ,ఇబ్రహీం పట్నం,కిష్టంపేటలో వివక్షతోనే దళితులనే దాడులు చేశారని వెల్లడించారు.ఇవన్నీ కాంగ్రెస్ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు.

సవరణ,చర్చ లేకుండానే రద్దు...

రాజ్యాంగ సవరణ, పార్లమెంట్ లో చర్చ లేకుండానే, కేబినెట్ లో నిర్ణయం తీసుకొని ప్రెసిడెన్షియల్ ఆర్డర్ రద్దు చేయవచ్చుని ఆర్ఎస్పీ సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని చెప్పడం కాదు.. క్రైస్తవులు, ముస్లింల అభివృద్ధి ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. మతం మారితే ఎస్సీ హోదా తొలగించాలనే ఆర్డినెన్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ ఎస్సీ హోదా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ గతంలోనే కేజీ బాలకృష్ణన్ కమిటీకి నివేదిక అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు..దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా లభించే వరకు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణంగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- ఈ నెల 15న సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- సభాస్థలి, హెలిపాడ్ ను పరిశీలించిన జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 10 (ప్రజా కలం):

ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి కి రానున్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి లో అధికారికంగా ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను, అంబేద్కర్ స్టేడియంలోని బహిరంగ సభ స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తో కలిసి పరిశీలించారు. అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అరకొరగా మాత్రమే రేషన్ కార్డులు అందాయని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి 5 లక్షల మందికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందించబోతున్నామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట కు కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి గడ్డపై ఘన స్వాగతం పలుకుతామని జగ్గారెడ్డి తెలిపారు. సుమారు 50 వేల మంది జనసమీకరణతో ఈ బహిరంగ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275**, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com